www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
28 జూలై 2023
సంపుటి:1 సంచిక:278

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## 'మణిపూర్ మహిళల ఊరేగింపు' కేసు సీబీఐకి

**-అసోంలో న్యాయ విచారణ!**

**నేషనల్ బ్యూరోవిశాల భారతి:** మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు దర్యాప్తును సీబీఐ అప్పగిస్తున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ ఘటనకు పాల్పడిన నిందితులకు కఠిన శిక్షలు పడేందుకు అన్ని రకాల చర్యలను తీసుకుంటామని తెలిపింది. దీంతో పాటు పొరుగు రాష్ట్రం అసోంలో న్యాయ విచారణ జరిగేలా చూడాలని కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని నిర్ణయించింది. వైరల్ వీడియోను చిత్రీకరించిన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని.. వీడియో తీసిన వ్యక్తిని సైతం అరెస్ట్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పూర్తి వివరాలు రాబట్టేందుకు ఫోన్‌ను రికవరీ చేస్తున్నామని చెప్పాయి. మణిపుర్‌లో సాధారణ పరిస్థితిని నెలకొల్పేందుకు మైతేయ్, కుకీ వర్గాల సంఘాలతో ఇప్పటికీ చర్చిస్తున్నామని కేంద్రం తెలిపింది. కాగా, ఈనెల ఆరంభంలో ఇద్దరు

..మిగతా 2 లో



# వాన బీభత్సం

## పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

### నేషనల్ హైవేపై నిలిచిపోయిన కార్లు

### స్తంభించిన రాకపోకలు

తెలంగాణ బ్యూరోవిశాలభారతి: తెలుగు రాష్ట్రాల్లో ఆగకుండా కురుస్తున్న వర్షానికి కుంటలు, కాలువలు, నదులు ఉప్పొంగుతున్న సంగతి తెలిసిందే. దీనివల్ల ఆ వరద నీరు రహదారుల పైకి వచ్చి కొన్ని చోట్ల రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా నేడు (జూలై 27) హైదరాబాద్ విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే పై నుంచి వేగంగా వరద నీరు పారింది. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ సమీపంలో ఐతవరం అనే గ్రామం సమీపంలో వరద నీరు రోడ్డుపై నుంచి భారీగా ప్రవహిస్తుండడం వల్ల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ఏపీ, తెలంగాణ మధ్య రాకపోకలు స్తంభించినట్లుగా అయింది.

వరద నీటి నుంచి ముందుకు వెళ్లే పరిస్థితి లేక వందల సంఖ్యలో కార్లు, బస్సులు, లారీలు, ఇతర వాహనాలు నేషనల్ హైవేపై నిలిచిపోవాల్సి వచ్చింది. దాదాపు రెండు కిలో మీటర్ల పొడవునా వాహనాలు ఆగిపోయాయి. కొంత మంది రిస్క్ చేసి వాహనాలను పారుతున్న నీటిలో నుంచే పోనిచ్చారు. ఐతవరం దగ్గర పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. విజయవాడహైదరాబాద్ జాతీయ రహదారిపై కీసర వంతెన వద్ద మూడు ఏర్లు కలిసి వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కుండపోతగా కురుస్తున్న సంగతి తెలిసిందే. గతరాత్రి కురిసిన వర్షానికి రెండు రాష్ట్రాల్లో నదులు, కాలువలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మరోవైపు, ఇళ్లల్లోకి నీళ్లు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకోవైపు అధికారులు అప్రమత్తమై, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాల ప్రభావంతో గోదావరి వరద ఉధృతి ధవళేశ్వరం వద్ద మరో రెండు రోజులు వరకు పెరుగున్నట్లు

..మిగతా 2 లో

### భయపెట్టిన కడెం ప్రాజెక్టు..!

- రోజంతా హై టెన్షన్. నిండు కుండలా ప్రాజెక్టు
- ఆనకట్టపై నుంచి వరద ప్రవహించడంతో అధికారుల్లో టెన్షన్
- ఉలిక్కిపడ్డ ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామ ప్రజలు
- ఉదయం మొరాయించిన నాలుగు గేట్లు.. సాయంత్రానికి ఓపెన్
- 12 గ్రామాలను ఖాళీ చేయించిన అధికారులు
- గతేడాది ఇలాగే జరిగినా గుణపాఠం నేర్వని ప్రభుత్వం
- ఏడాదిగా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో ప్రాజెక్టు ప్రమాదంలో పడిందంటూ విమర్శలు

3



## వెంకట్ రెడ్డిపై

# గులాబీ కుట్రలు..!

- 24 గంటల ఉచిత విద్యుత్ డొల్లతనాన్ని -బట్టబయలు చేసిందని టార్గెట్
- కుట్ర రాజకీయాలకు తెరలేపిన అధికార పార్టీ
- పెరుగుతున్న కాంగ్రెస్ గ్రాఫ్ ని చూసి ఓర్వలేక కుటిల యత్నాలు
- వ్యాపార, స్వార్థం కోసమే కుంభం బీఆర్ఎస్ తీర్థం
- 20 ఏళ్లుగా భువనగిరి ఎమ్మెల్యేతో రియల్ బంధం
- కుంభం తప్పుడు ఆరోపణల వెనుక గులాబీ బాస్ వ్యూహం
- వెంకట్ రెడ్డి మానసిక ధైర్యాన్ని దెబ్బతీసేందుకే 'కారు' కూతలు

**హైదరాబాద్- విశాల భారతి:**

అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది గులాబీ పార్టీ కుట్ర రాజకీయాలకు తెర లేపింది. 24 గంటల ఉచిత విద్యుత్తు రైతులకు అందడం లేదని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నిరూపించిన తర్వాత ఆయనపై బురదజల్లే రాజకీయాలకు అధికారం పార్టీ కుట్రలు చేస్తుంది. ఎన్నాళ్లుగానో బీఆర్ఎస్ పార్టీతో అంటకాగుతున్న కుంభం అనిల్ కుమార్ రెడ్డిని తన పార్టీలో చేర్చుకోవడం ద్వారా ఇది నిజమని తేలింది. రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ కోవర్టుగా పనిచేసిన అనిల్ కుమార్ రెడ్డి తాజాగా ఆ పార్టీలో అధికారికంగా చేరడంతో భువనగిరిలో కాంగ్రెస్ కు పట్టిన శని వదిలిందని కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. స్వార్థం కోసమే అనిల్ నక్క ఏడుపులు మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై అనిల్ కుమార్ లాంటి రాజకీయ వ్యభిచారి ఆరోపణలు చేయడంపై కాంగ్రెస్ వాదులు మండిపడుతున్నారు. బీసీ నాయకులను కాదని తనకు రాజకీయ బిక్ష పెట్టిన గురువు లాంటి కోమటిరెడ్డి పై ఆరోపణలు చేయడం ఏంటని నిలదీస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని నైతికంగా ఎప్పుడో వదిలేసిన కుంభం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు తనకు ఇబ్బంది కలిగిస్తున్నారంటూ నక్క ఏడుపులు ఏడవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింప చేసుకునేందుకే అధికార పార్టీలోకి వెళ్లారని, ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ

..మిగతా 2 లో

## ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత

# ప్రాంతాలకు తరలించండి

- వర్షా ల నేపథ్యంలో అత్యవసర చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష
- ప్రాణనష్టం జరగకుండా చూడాలని మంత్రులకు ఆదేశం
- సహాయచర్యల కోసం క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం
- ప్రాజెక్టుల వద్దే ఉండాలని ఈఎన్సీలకు, చీఫ్ ఇంజనీర్లకు ఆదేశం
- క్షేత్రాస్థాయిలో సహాయక చర్యల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం
- లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు

**హైదరాబాద్,విశాలభారతి:**

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలను రక్షిస్తూ, ప్రాణనష్ట నివారణ చర్యలు చేపట్టే దిశగా మంత్రులను, ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ వారికి ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చారు. మంత్రులతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూ ప్రాణనష్టం జరగకుండా చూడాలని, అనుకోకుండా ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే వారికి మెరుగైన చికిత్స అందించేలా చూసుకోవాలని సీఎం కోరారు. ఆయా జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరూ ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా, అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలు చేపట్టాలని సీఎం మంత్రులను ఆదేశించారు.

**తక్షణ రక్షణ చర్యలు చేపట్టండి**

తక్షణ రక్షణ చర్యల కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. ముంపుకు గురైన ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, రక్షణచర్యల కోసం హెలికాప్టర్లు సహా, ఆహారం, వైద్యం తదితర రక్షణ సామాగ్రి,



సంబంధిత శాఖల యంత్రాంగాన్ని పంపించేలా చర్యలు చేపట్టారు.విపత్తుల నిర్వహణ శాఖకు, ఫైర్ సర్వీసుల శాఖకు, పోలీసు శాఖతో సమన్వయం చేస్తూ సిఎస్ సహాయక చర్యలు చేపట్టారు. అదే సందర్భంలో పోలీస్ యంత్రాంగాన్ని సహాయక చర్యల్లో పాల్గొనేలా అప్రమత్తం చేయాల్సిందిగా రాష్ట్ర డిజిపిని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు స్టేట్ లెవల్ ఫ్లడ్

..మిగతా 2 లో



## మోరంచపల్లి వాసులకు అండగా నిలిచిన కిషన్ రెడ్డి

- బాధితుల ఫోన్ కాల్ రావడంతో వెంటనే రంగంలోకి
- జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్న కేంద్ర మంత్రి
- కేంద్ర హోంమంత్రి, కేంద్ర హోం సెక్రటరీకి ఫోన్లో పరిస్థితిని వివరించి..బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి
- రంగంలోకి రెండు హెలికాప్టర్స్, 5 ఎన్డీఆర్ఎఫ్ టీమ్స్
- వరదలో చిక్కుకున్న వారందరినీ క్షేమంగా పునరావాస కేంద్రాలకు తరలింపు
- వరద బాధితులకు అండగా నిలవాలని బీజేపీ శ్రేణులకు పిలుపు

2



## 'ప్రాణ నష్టం జరగకుండా చూడటమే

# ప్రధాన లక్ష్యం'

### పురపాలక ఉద్యోగుల అన్ని సెలవును రద్దు చేశాం

### ప్రతిపక్ష నేతలు రాజకీయాలు మాని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి: కేటీఆర్

**తెలంగాణ బ్యూరో- విశాల భారతి:**

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పురపాలక శాఖ అధికారులతో కూడా సీఎం ప్రత్యేకంగా మాట్లాడారని మంత్రి వివరించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణాల్లో ఉన్న పరిస్థితులపైనా సమీక్షించిన కేటీఆర్.. హైదరాబాద్ నుంచి పురపాలక అధికారులు అడిషనల్ కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మొదటగా హుస్సేన్‌సాగర్ వద్ద వరద ఉద్ధృతిని పరిశీలించిన మంత్రి కేటీఆర్.. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపైన అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. శిథిల భవనాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. పురపాలక ఉద్యోగుల అన్ని సెలవును రద్దు చేశామని.. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్లు, ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షిస్తున్నామని

..మిగతా 2 లో



## వర్షా ల ఎఫెక్ట్..

- వైద్యారోగ్య శాఖ సిబ్బందికి సెలవులు రద్దు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

2



### వర్షా లు తగ్గుముఖం

## పట్టినట్టే..

- మరొక అల్పపీడనం ఏర్పడితే తప్ప
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కె. నాగరత్న

2

# వాన బీభత్సం

మొదటిపేజీ తరువాయి

విపత్తుల సంస్థ ఎండి డా.బిఆర్ అంబేద్కర్ తెలిపారు. గురువారం రాత్రి 7 గంటలకు గోదావరి వరద ప్రవాహం భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక కోనసాగుతుందని నీటిమట్టం 47.80 అడుగులు, ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 13.05 లక్షల క్యూసెక్కులు ఉందని రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించారు.

**పెరుగుతున్న గోదావరి నీటి మట్టం**

ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాల ప్రభావంతో గోదావరి వరద ఉధృతి ధవళేశ్వరం వద్ద మరో రెండు రోజులు వరకు పెరుగున్నట్లు విపత్తుల సంస్థ ఎండి డా.బిఆర్ అంబేద్కర్ తెలిపారు. గురువారం రాత్రి 7 గంటలకు గోదావరి వరద ప్రవాహం భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక కోనసాగుతుందని నీటిమట్టం 47.80 అడుగులు, ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 13.05 లక్షల క్యూసెక్కులు ఉందని రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించారు.

రెండవ ప్రమాద హెచ్చరిక వలన ప్రభావితమయ్యే అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 42 మండలాల్లో 458 గ్రామాల వరకు క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.

విపత్తుల సంస్థ ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ సంబంధిత జిల్లాల యంత్రాంగానికి సూచనలు జారీ చేస్తున్నామన్నారు. అత్యవసర సహాయక చర్యలకోసం 3NDRF, 4 SDRF మొత్తం 7 బృందాలు ఉన్నట్లు విపత్తుల సంస్థ ఎండి తెలిపారు. ప్రజల ఫోన్లకు హెచ్చరిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సందేశాలు పంపుతున్నామన్నారు. పూర్తిస్థాయిలో వరద తగ్గే వరకు గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరో వైపు ప్రకాశం బ్యారేజి వద్ద 1.42 లక్షల ఔట్ ఫ్లో ఉందని కృష్ణా లొతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు అత్యవసర సహాయం, సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 1070, 1800 425 0101 సంప్రదించాలన్నారు.తెలుగు రాష్ట్రాల్లో ఆగకుండా కురుస్తున్న వర్షానికి కుంటలు, కాలువలు, నదులు ఉప్పొంగుతున్న సంగతి తెలిసిందే. దీనివల్ల ఆ వరద నీరు రహదారులపైకి వచ్చి కొన్ని చోట్ల రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా నేడు (జూలై 27) హైదరాబాద్ విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే పై నుంచి వేగంగా వరద నీరు పారింది. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ సమీపంలో ఐతవరం అనే గ్రామం సమీపంలో వరద నీరు రోడ్డుపై నుంచి భారీగా ప్రవహిస్తుండడం వల్ల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ఏపీ, తెలంగాణ మధ్య రాకపోకలు స్తంభించినట్లుగా అయింది.

## వర్షా లు తగ్గుముఖం పట్టినట్టే..

**హైదరాబాద్‌విశాల భారతి:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ఈరోజు ఉదయం అల్పపీడనంగా బలహీనపడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కె. నాగరత్న తెలిపారు. మరో అల్పపీడనం ఏర్పడితే తప్ప ఇక భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినట్లేనన్నారు. ''తెలంగాణపై నైరుతి రుతుపవనాలు ఉధ్ధృతంగా ఉన్నాయి. తాజాగా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాలు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో అతి పెద్ద వర్షాలుగా నమోదయ్యాయి. హనుమకొండ సహా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కొన్ని చోట్ల అసాధారణమైన భారీ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, కుమురంభీమ్ జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షం కురిసింది. ఆగస్టు రెండో వారం, సెప్టెంబరులో కూడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నాయి. తీవ్ర అల్పపీడనంగా బలహీనపడి ప్రస్తుతం దక్షిణ ఒడిశా, పరిసరాల్లో ఉత్తరాంధ్ర వద్ద కొనసాగుతోంది. శుక్రవారం పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, 29, 30, 31 తేదీల్లో ఎలాంటి హెచ్చరికలు లేవు'' అని వాతావరణ కేంద్రం డైరెక్టర్ తెలిపారు.



## 'ప్రాణ నష్టం జరగకుండా చూడటమే ప్రధాన లక్ష్యం'

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. ఎడతెరిపి లేకుండా కుంభవృష్టి వర్షం కురవడం ద్వారా ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవుతుందన్నారు. తమ ప్రధాన లక్ష్యం ప్రాణనష్టం జరగకుండా చూడడమేనని స్పష్టం చేశారు.

**ఈ సమయంలో ప్రతిపక్షాలు రాజకీయాలేంటి**

ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు మాని భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని హితవు పలికారు. భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దని అన్నారు. మూసీ వరదను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని.. అవసరమైతే తాను కూడా శుక్రవారం స్వయంగా వెళ్లనున్నట్లు చెప్పారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మూసీ నదిలో భారీ నీటి ప్రవాహం కొనసాగుతోంది. మూసారాంబాగ్ వంతెన వద్ద నది ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు అక్కడ ఏ మాత్రం ప్రవాహం పెరిగిన.. వంతెన మీద నుంచి రాకపోకలను నిలిపివేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు. అయితే వంతెన వద్ద నీటి ప్రవాహన్ని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. తాజా పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకొని.. చాదర్‌ఘాట్ వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని కూడా కేటీఆర్ అధికారులతో కలిసి పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తం చేయాలని సూచించారు. భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు.

## 'మణిపూర్ మహిళల ఊరేగింపు' కేసు సీబీఐకి

మొదటిపేజీ తరువాయి

గిరిజన మహిళలపై జరిగిన అత్యాచార ఘటన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటం వల్ల దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగింది. మోదీ సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందిదంటూ ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇదే విషయంపై చర్చించాలంటూ పార్లమెంట్ లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. గత మూడు నెలలుగా సాగుతున్న మణిపుర్ అల్లర్లలో ఇప్పటివరకు 181 మంది మృతిచెందారు. మే నెలలో ఈ హింస ప్రారంభమైన దగ్గరి నుంచి 10వేల ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మృతుల్లో 60 మంది మైతేయ్‌లు ఉండగా.. 113 మంది కుకీలు ఉన్నారు. ముగ్గురు భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. మొత్తంగా 21 మంది మహిళలు ఈ ఘర్షణలకు బలయ్యారు.

# గులాబీ కుట్రలు..!

మొదటిపేజీ తరువాయి

బలోపేతానికి ఆయన చేసింది ఏమీ లేదని చెప్తున్నారు.

**లాగ్ బుక్కులతో కాంగ్రెస్ ను రేసులో నిలిపిందు**

కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తన సుదీర్ఘ రాజకీయంలో ఎలాంటి మచ్చ లేకుండా మంచి పేరు సంపాదించుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. తెలంగాణ రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా అధికారంలో లేకున్నా అధికార పార్టీ ప్రలోభాలకు లొంగలేదు. కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా గులాబీ పార్టీలో చేరిన నికార్సయిన కాంగ్రెస్ వాదిగా కాంగ్రెస్ జెండా భుజాన మోసిన చరిత్ర ఉన్న నాయకుడు వెంకట్ రెడ్డి. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నారు. తాజాగా రేవంత్ రెడ్డి చేసిన మూడు గంటల విద్యుత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకమైంది. సబ్ స్టేషన్ లోని లాగ్ బుక్కులను వెలికి తీయడం ద్వారా రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందడం లేదని వెంకటరెడ్డి మీడియా ముఖంగా నిరూపించారు. మరోసారి కాంగ్రెస్ పార్టీని ఎన్నికల రేసులో ముందు వరుసలో నిలిపారు. అధికార పార్టీ అబద్ధాల ప్రచారాన్ని తిప్పికొట్టారు.

**కొండలను కరిగించిన బెంగళూరు బ్రదర్స్...**

వెంకట్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తూ పార్టీని వీడిన అనిల్ కుమార్ రెడ్డి నీచ, స్వార్థ రాజకీయాలను భువనగిరిలో కాంగ్రెస్ వాదులు ఎండగడుతున్నారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి తో కలిసి గత 20 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరిద్దరూ కలిసి భువనగిరిలో కొండలను మింగేశారని ఆరోపిస్తున్నారు.



వందల కోట్ల విలువైన భూములను ఇప్పటికే ఇద్దరు కలిసి కాజేశారని ఆరోపణలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. బెంగళూరు బ్రదర్స్ గా గుర్తింపు తెచ్చుకున్న వీరిద్దరూ ఇప్పటికే వేలాది కోట్ల రూపాయలను వెనకేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. యాదాద్రి పునర్ నిర్మాణంతో వీరు కోట్లకు పడగెత్తారని కనిపించిన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమంగా అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా గులాబీ బాస్, యువనేత కనుసన్నలలోని జరిగినట్లు కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

**'కుంభం' కుమ్మక్కు రాజకీయాలు..**

ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరగడం కూడా బీఆర్ఎస్ అధినేతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. దీంతో కాంగ్రెస్ పార్టీపై కుట్ర చేస్తూ.. గులాబీ బాస్ లత్కోర్ రాజకీయాలకు తెరలేపిండని కాంగ్రెస్ వాదులు మండిపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ విజయం ఖాయమని గుర్తించిన గులాబి బాస్ ఆ జిల్లాలో కీలక నేతగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మానసిక ధైర్యాన్ని దెబ్బతీసేందుకు పాల్పడుతున్నాడు. అందుకు సంబంధించిన వ్యూహంలో భాగంగానే కుంభం చేత ఆరోపణలు చేయించి పార్టీ మారేలా చేశాడు. వాస్తవానికి 2014 నుంచి భువనగిరి నియోజకవర్గంలో కుంభం అనిల్ కుమార్ రెడ్డిని రాజకీయంగా ఎదిగేలా వెన్ను తట్టి ప్రోత్సహించింది వెంకటరెడ్డే. ఆయన చూపిన బాటలోనే రాజకీయంగా ఎదిగిన కుంభం.. అనంతరం తన స్వార్థం కోసం శేఖర్ రెడ్డితో కలిసి కుమ్మక్కు రాజకీయాలు వెలుగపెట్టాడు. సరిగ్గా ఎన్నికలకు ముందు వరకు కలిసిమెలిసి వ్యాపారం చేసుకుంటూ.. ఎన్నికల సమయంలో కొన్ని రాజకీయ ఆరోపణలు చేసి ప్రజలను, కార్యకర్తలను మభ్య పెట్టడం తప్ప కుంభం చేసింది ఏమీ ఉండదని, ఇక ఎన్నికల తర్వాత ప్రజా సమస్యలను గాలి కోదిలేసి తన వ్యాపారం చేసుకోవడంలో పూర్తిగా నిమగ్నం అయ్యే వారని, అలాంటివాడు ప్రజానేతయిన కోమటిరెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేయడం వెనుక గులాబీ పార్టీ బాస్ వ్యూహం ఉన్నదని కాంగ్రెస్ వాదులు అనుమానిస్తున్నారు. మరోవైపు గులాబీ పార్టీ ఎన్ని కుట్రలు చేసిన, ఎన్ని పన్నాగాలు పన్నిన ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఉన్న 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెబుతున్నారు.

## ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

మొదటిపేజీ తరువాయి

మానిటరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసి డిజిపి పర్యవేక్షిస్తున్నారు.

**ప్రాణనష్టం జరగకుండా చర్యలు**

- రాష్ట్రంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ ప్రాణనష్టం జరగకుండా చూసేలా చర్యలు చేపట్టాలని ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ, సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు.

**సీఎం ఆదేశాలతో రంగంలోకి మంత్రులు**

- సీఎం ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ జిహెచ్ఎంసి పరిధిలో విస్తృతంగా పర్యటన చేపట్టారు. వానలోనే తడుస్తూ, ప్రజలను పరామర్శిస్తూ, అధికార యంత్రాంగానికి ఆదేశాలిస్తూ రక్షణ చర్యల కోసం ముందుకు సాగారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తూ, సహాయ చర్యలను చేపట్టేలా జిహెచ్ఎంసి అధికారులకు ఆదేశాలిచ్చారు.
- సీఎం కేసీఆర్ మంత్రి సత్యవతి రాథోడ్ కు ఫోన్ చేసి గోదావరి పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన మోరంచపల్లి గ్రామంలో ప్రజలను రక్షించేలా పరిస్థితిని సమీక్షించారు. స్వయంగా చలివాగుతో పాటు వరద ముంపుకు గురైన ప్రాంతాలను మంత్రి పరిశీలించారు.
- మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి, పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించి ప్రజలకు ఆహారం, దుస్తులు అందించారు.
- సీఎం ఆదేశాల మేరకు మంత్రి హరీష్ రావు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి, జిల్లాల్లో కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి ఎక్కడ అవసరమైతే అక్కడ అత్యవసర వైద్య సదుపాయాలు అందించేలా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.
- నిజామాబాద్ జిల్లాలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పునరావాస సహాయక చర్యలు చేపట్టారు. సీఎం కేసీఆర్ ప్రశాంత్ రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
- హైదరాబాద్ స్థానిక పరిస్థితులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ శ్రీమతి విజయలక్ష్మి, అధికారులతో సమీక్షించారు.
- కడెం ప్రాజెక్టు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కడెం ప్రాజెక్టు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఇంద్రకరణ్ రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితులను ఆరా తీశారు.
- సీఎం ఆదేశాల మేరకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఉదయం భద్రాచలంలో ప్రత్యేకాధికారి అనుదీప్ తో కలిసి గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. ఖమ్మం జిల్లా మున్నేరువాగులో చిక్కుకున్న వారిని రక్షిచేందుకు స్వయంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రంగంలోకి దిగారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సహాయక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- సీఎం ఆదేశాల మేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ములుగు జిల్లాల్లో వరదల్లో చిక్కుకున్న పర్యాటకులను కాపాడేందుకు తీసుకున్న చర్యలు ఫలితాన్నిచ్చాయి.
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రి జగదీష్ రెడ్డి భారీ వర్షాల పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూసీ తదితర ప్రాంతాల్లో రక్షణ చర్యలకై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.
- సీఎం ఆదేశాల మేరకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్ నగర్ వరద ముంపు ప్రాంతాల్లో స్వయంగా తిరిగి ప్రజలకు భరోసానిచ్చారు. వరద నీరు ఇండ్లలోకి నీరు రాకుండా, సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించారు. వరదల నేపథ్యంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో కూడా పరిస్థితులను సమీక్షించారు.
- కరీంనగర్ జిల్లా పరిధిలోని వరద పరిస్థితులను మంత్రి గంగుల కమలాకర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ మేరకు మానేరు డ్యామ్ వద్ద వరదను అధికారుల సహాయంతో కిందకు వదిలారు. జిల్లాలో వరద పరిస్థితిని సమీక్షించి, అధికారులకు ఆదేశాలిచ్చారు.



**చీఫ్ ఇంజనీర్లకు స్వయంగా సీఎం ఫోన్లు**

ఎగువన కురుస్తున్న భారీ వర్షా ల నేపథ్యంలో గోదావరి, దాని ఉపనదులు, వాగులు, వంకలు ప్రమాద హెచ్చరికలు దాటి ఉప్పొంగి ప్రవహిస్తున్న పరిస్థితుల్లో, వరద ముంపును తగ్గించే చర్యలు చేపట్టాలని, ఈ మేరకు ఇన్ ఫ్లో ను ముందస్తు అంచనా వేసి, గేట్లు ఎత్తివేస్తూ, వరద నీటిని కిందికి వదలాలని చీఫ్ ఇంజనీర్లకు సీఎం ఫోన్ ద్వారా ఎప్పటికప్పడు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఎస్సారెస్పీ, కాళేశ్వరం ప్రాజెక్టులు, కడెం ప్రాజెక్టు, మిడ్ మానేరు, లోయర్ మానేరు తదితర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లకు స్వయంగా సీఎం ఫోన్లు చేసి, పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టుల పరిస్థితిని క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు.

## లింక్ డాక్యుమెంట్ పోయింది

నేను, పడమల నాగేశ్వర్ రెడ్డి, 15/07/2023న హైదరాబాద్‌లోని అంబర్ పేట నుండి కొత్త పేటకు బస్సులో వెళ్తుండగా కొహెడ గ్రామ పరిధిలోని నా ప్లాట్ నంబర్ 59, సర్వే నెంబర్ 486 యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోగొట్టుకున్నాను. ఎవరికైనా ఎక్కడైనా కనిపిస్తే దయచేసి తెలియజేయండి.

**Cell No. 8686211422**



## పోలవరం నిధులపై కేంద్రం క్లారిటీ

**ఆంధ్రప్రదేశ్‌విశాలభారతి:** పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు ఆమోదించాకే నిధుల విడుదల ఉంటుందని మచిలీపట్నం వైసీపీ ఎంపీ వి.బాలశౌరి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ టుడు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ''పోలవరం పనుల తీరుకు అనుగుణంగానే నిధులు విడుదల ఉంటుంది. జూన్ 5న రాష్ట్రం తాజా ప్రతిపాదన సమర్పించింది. 41.15 మీటర్ల మేర నీటి నిల్వకు ప్రతిపాదన సమర్పించింది. రూ.17,144కోట్లతో రాష్ట్రం సవరించిన ప్రతిపాదన ఇచ్చింది. రాష్ట్రం పంపిన తాజా ప్రతిపాదనను కేంద్రం ఆమోదించాల్సి ఉందని బిశ్వేశ్వర టుడు వెల్లడించారు.

## మోరంచపల్లి వాసులకు అండగా నిలిచిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్,విశాలభారతి:** నాలుగురోజులగా భూపాలపల్లి జిల్లాలో భారీ వర్షాల కారణంగా తలెత్తిన వరద బీభత్సంపై కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి స్పందించారు. వరదల్లో చిక్కుకుపోయిన వారి నుంచి తనకు గురువారం ఉదయం ఫోన్ కాల్ రావడంతో.. వెంటనే స్పందించిన కేంద్రమంత్రి జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదలో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లాతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి ఊరంతా వరదలో మునిగిపోయిందని.. రెండు ఇండ్లపైకి స్థానికులు చేరుకుని సహాయం కోసం ఎదురు చూస్తున్నారని కిషన్ రెడ్డి వెల్లడించారు. స్థానికులు అక్కడినుంచి తనకు ఫోన్ చేసి సహాయం అర్థిస్తున్నారని, వారిని వీలైనంత త్వరగా ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలని కోరారు.

**పునరావాస కేంద్రాలకు తరలింపు**

దీనిపై స్పందించిన కేంద్రం.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేసి.. వెంటనే రెండు హెలికాప్టర్‌లను, 5 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను హుటాహుటిన రంగంలోకి దించింది. 2 హెలికాప్టర్‌ల ద్వారా ఆ రెండు ఇండ్లపై చిక్కుకున్న గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించారు. సమీపంలోని గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీలతోపాటు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వీరికి ఆశ్రయం కల్పించారు.

**ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి**

తెలంగాణలో మరోరెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కిషన్ రెడ్డి సూచించారు. అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో అవసరమైనవారికి సహాయం అందించేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో అసాధారణ వర్షపాతం నమోదు!

-ఐఎండీ హెచ్చరిక

**తెలంగాణ బ్యూరో,విశాల భారతి:** రాష్ట్రంలో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు.. అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది. రాష్ట్రంలో భారీ వర్షాలు నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన గంటకు 40నుంచి 50కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని ఐఎండీ వివరించింది. రేపు భారీ వర్షాలు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు తెలిపారు. ఈ రెండు రోజులు కూడా రెడ్ అలెర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. నిన్నటి తీవ్ర అల్పపీడనం ఈ రోజు బలహీనపడి.. ప్రస్తుతం దక్షిణ ఒడిస్సా పరిసరాల్లోని ఉత్తర ఆంధ్రప్రదేశ్ వద్ద కొనసాగుతుందని తెలిపారు. ఈ అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్రమట్టం నుంచి 7.6కిలో మీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందన్నారు.. రుతుపవన ద్రోణి ఈ రోజు బికానర్, కోట,రైజన్, దుర్గ్,దక్షిణ ఒడిస్సా పరిసరాల్లోని ఉత్తర ఆంధ్ర ప్రదేశ్‌లోని అల్పపీడన ప్రాంతం మీదుగా తూర్పు ఆగ్నేయ దిశగా పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్రమట్టానికి 1.5కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు వివరించారు.

## వర్షాల ఎఫెక్ట్..

**హైదరాబాద్‌విశాల భారతి:** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరపి లేని వర్షాలు, వరదల నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలకు.. ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో వైద్య సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దని.. ఇప్పటికే లీవ్‌లో ఉన్నవారికి సైతం రద్దు చేయాలని పేర్కొన్నారు. అన్ని ఆసుపత్రులు పూర్తి సిబ్బందితో పని చేయాలని వివరించారు. ఎప్పటికప్పుడు స్థానిక పరిస్థితులను పర్యవేక్షించుకుంటూ అవసరమైన వైద్య సేవలు అందించాలని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మరోవైపు వరదల నేపథ్యంలో ఈ నెల 20 నుంచి కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భిణులను.. దగ్గరలోని ఆసుపత్రులకు తరలించి వారికి ఉచితంగా ఆహారం, మందులు అందిస్తున్నామని డీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 503 మంది గర్భిణులను ప్రసవం కోసం సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ప్రకటించారు. అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచే 80 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇక వర్షాల దృష్ట్యా.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ఎమర్జెన్సీ విభాగాలు 24 గంటలు పూర్తి సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఓ కాల్‌సెంటర్‌ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ క్రమంలోనే సరిపడినంత రక్త నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని బ్లడ్ బ్యాంకులను శ్రీనివాసరావు ఆదేశించారు.



## భూమనకు టీటీడీ చైర్మన్ పదవి?

**- సీఎం జగన్ తో తిరుపతి ఎమ్మెల్యే కీలక సమావేశం**

**ఆంధ్ర ప్రదేశ్ విశాలభారతి:** సీఎం జగన్‌ను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా భూమన తన నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. వచ్చే నెల 12తో టీటీడీ చైర్మన్, పాలకమండలి పదవీ కాలం ముగియనుంది. ప్రస్తుతం టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ఉన్న భూమన టీటీడీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎంతో కరుణాకర్‌రెడ్డి భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తితిదే చైర్మన్ సహా పాలకమండలి సభ్యుల నియామకాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యే పదవికి పోటీ చేయనని ఇప్పటికే స్పష్టం చేసిన భూమన తన కుమారుడికి తిరుపతి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఈ అంశంపైనా సమావేశంలో చర్చించినట్టు సమాచారం. సీఎం జగన్‌ను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కలిశారు. ప్రకాశం జిల్లా సహా తన నియోజకవర్గంలో సమస్యలపై సీఎంతో చర్చించారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు సహా రాజకీయ పరంగా నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. గత కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న బాలినేని గతంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పదవికీ రాజీనామా చేశారు. సీఎం జగన్ బుజ్జగించినా రాజీనామా ఉపసంహరించుకోలేదు. అప్పటి నుంచి కేవలం తన నియోజకవర్గానికే పరిమితమయ్యారు.

# భయపెట్టిన కడెం ప్రాజెక్టు..!

**నిర్మల్ ,విశాలభారతి;**



**గతేడాది కంటే దారుణం**

**గతేడాది కూడా ఇదే సీన్ రిపీటైన ప్రభుత్వము తగిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయింది. దాంతో ఇప్పుడు అంతకంటే పరిస్థితి దారుణంగా మారిందనీ స్థానికులు వాపోతున్నారు. గతేడాది గుణపాఠాలను మైండ్‌కు ఎక్కించుకోకుండా మిన్నకుండిపోయారని నిర్మల్ జిల్లా ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వ నిర్లక్ష్యం అని.. ఏడాదిగా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో కడెం ప్రమాదం లో పడిందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

కడెం ప్రాజెక్టుకు ముప్పు తప్పింది. ప్రాజెక్టుకు వరద తగ్గడంతో అధికారులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఉదయం ప్రాజెక్టుకు 3లక్షల క్యూసెక్కులకుపైగా వరద రాగా.. ఉదయం ఆనకట్టపై నుంచి వరద ప్రవహించడంతో ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు. భయంతో ముటముల్లే సర్దుకుని పునరావాస కేంద్రాలకు వెళ్లారు. కాగా ప్రస్తుతం కడెం ప్రాజెక్టులోకి 1.30లక్షల క్యూసెక్కులకు వరద తగ్గింది. 16 గేట్లు ద్వారా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఉదయం నాలుగు గేట్లు మొరాయించగా.. రెండుగేట్లను అతి కష్టం మీద ఇంజినీర్లు పైకి ఎత్తి నీటిని విడుదల చేశారు. కడెం ప్రాజెక్టు ప్రస్తుతం ఔట్ ఫ్లో 2.30లక్షల క్యూసెక్కులుగా ఉన్నది.

**సర్వత్రా ఆందోళనలు**

నిండు కుండలా తొణికిసలాడుతూ కడెం ప్రాజెక్టు భయపెట్టినది. ఓపెన్ అవ్వకుండా మొరాయించిన గేట్లను అధికారులు కొన్ని గంటలపాటు శ్రమించి తెరిపించారు. దీంతో బుధవారం నుంచి నెలకొన్న ఉత్కంఠకు గురువారం సాయంత్రం తెరపడింది. ప్రాజెక్ట్ పూర్తిగా నిండిపోయి పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో సర్వత్రా ఆందోళనలు నెలకొన్నాయి. ఏ రూపంలో ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనన్న ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల లోని ప్రజలు భయంతో బిక్కుబిక్కు మంటూ గడిపారు. అయితే ఎట్టకేలకు సాయంత్రం సమయంలో రెండు గేట్లు తెరచుకోవడంతో అధికార యంత్రాంగం తోపాటు ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

**డేంజర్ జోన్ లో ప్రాజెక్ట్**

అంతకు ముందు కడెం ప్రాజెక్ట్ డేంజర్ జోన్ లో ఉండే. భారీగా పెరుగుతున్న వరద ఉధృతితో ప్రాజెక్టు లోకి వచ్చే ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. సామర్థ్యానికి మించి నీరు వస్తుండడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు. అయితే మరో నాలుగు గేట్లు తెరుచుకో లేదు. జేసీబీ సాయంతో ఒక గేటును ఓపెన్ చేశారు. సామర్థ్యాన్ని మించి వరద నీరు రావడంతో కండె ప్రాజెక్టు నిండుకుండలా మారిపోయింది. ఈ క్షణంలో ఏమి జరుగుతుందో అన్న ఆందోళనలో అధికారులు సహాయక చర్యలు మొదలు పెట్టారు. కడెం ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.. ఇప్పటివరకు 12 గ్రామాలను ఖాళీ చేయించారు. కడెంలో ఐదు గ్రామాలు, దత్తులలో ఏడు గ్రామాలు ఖాళీ చేయించి వారిని పునరవాసా కేంద్రాలకు తరలించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి తగ్గినా..కడెంలో మాత్రం వర్షాలు దంచికొడుతున్నాయి. ప్రస్తుతం కడెం ప్రాజెక్ట్ డేంజర్ జోన్ లో కొనసాగడంతో కడెం, కన్నపూర్, దేవునిగూడెం, రాపర్, మున్యాల్, గొడిషిరియల్, పెద్ద బెల్యాల్ , చిన్న బెల్యాల్ , పాండవపూర్ గ్రామాలను అలర్ట్ చేశారు.



## స్టేషన్ బెయిల్ అంటే ఏమిటి..?

లీగల్ సందేహాలు

నేర విచారణ ప్రక్రియ,1973 (Cr. P. C.) ప్రకారం నేరం రెండు రకాలు. ఒకటి కాగ్నిజల్ నేరం రెండు నాన్ కాగ్నిజబుల్ నేరం. నేరం అంటే ఏమిటనీ భారత శిక్షా స్మృతి,1860 సెక్షన్ 40 లో వివరించడం జరిగింది. ఒక వ్యక్తి కాగ్నిజల్ నేరం గనుక చేస్తే పోలీస్ వారు సంబంధిత మెజిస్ట్రేట్ అనుమతి లేకుండా, ఎలాంటి వారెంట్ లేకుంటా సదరు వ్యక్తిని అరెస్ట్ చేయచ్చని సెక్షన్ 2(సి) & 41 చెబుతుం,ది. ఒక వ్యక్తి నాన్ కాగ్నిజబుల్ నేరం గనుక చేస్తే మేజిస్ట్రేట్ అనుమతి తో కూడిన వారెంట్ కలిగి ఉంటే మాత్రమే సదరు వ్యక్తిని అరెస్ట్ చేయాలని సెక్షన్ 2(ల్) వివరించడం జరిగింది. లేదా ఒక ఫిర్యాదు దారుడు పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదును ఇచ్చినప్పుడు అట్టి ఫిర్యాదు కాగ్నిజబుల్ నేరంగ పరిగణించిన్నప్పుడు పోలీస్ వారు మెజిస్ట్రేట్ వారెంట్ లేకుండా సదరు వ్యక్తిని అరెస్ట్ చేయచ్చని సెక్షన్ 41 చెబుతుంది. స్టేషన్ బెయిల్ అంటే ఏమిటి?

**స్టేషన్ బెయిల్ ను ఎవరు ఇస్తారు?**

ఒక వ్యక్తి ఏదైనా నేరం చేసినప్పుడు, సదరు వ్యక్తి కాగ్నిజబుల్ నేరం చేసినప్పటికీ పోలీస్ వారు అట్టి వ్యక్తిని అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని భావించినప్పుడు సెక్షన్ 41ఏ ప్రకారం వారికి ఉచితంగా నోటీసులు జారి చేయాలి. ఒక వేళా సదరు నోటీసులు తీసుకున్న వ్యక్తి పోలీస్ వారికి నేర విచారణకు లేదా ఇన్వెస్టిగేషన్ కి సహకరించని యెడల సంబంధింత మెజిస్ట్రేట్ యొక్క అనుమతి తీసుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించే అవకాశం ఉంటుంది. సెక్షన్ 41ఏ నోటీస్ ను F.I.R నమోదైన రెండు వారాల్లోగా ఇవ్వాలి లేకపోతే సంబంధింత ఎస్పీ యొక్క అనుమతి తీసుకొని నిర్ణిత గడువులోగా సెక్షన్ 41ఏ నోటీసులు జారి చేయాలి. నోటీసులు తీసుకున్న వ్యక్తి పోలీస్ వారికి సహకరించనప్పటికి వారు అరెస్ట్ చేస్తే నేరుగా హైకోర్టులో వారిపై రిట్ పిటిషన్ దాఖలు చేయొచ్చు. సెక్షన్ 41ఏ నోటీస్ ను పోలీస్ వారు జారీ చేస్తారు గనుక అందరూ స్టేషన్ బెయిల్ అంటారు. చట్టపరంగా స్టేషన్ బెయిల్ అనే క్రిమినల్ లా లో నిర్వచించబడలేదు. పిర్యాదుదారుడికి F. I. R. కాపీని ఉచితంగా ఇవ్వాలని సెక్షన్ 154 (2) సి.ర్.పి.సి చెబుతుంది. 2014 సం॥ లో సుప్రీంకోర్టు అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ తీర్పులో ఏడు సం॥ లోపు ఉన్న శిక్షకు F. I. R. నమోదైన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ను మంజూరు చేయాలని తీర్పునిస్తూ నేరారోపన ఎదుర్కొంటున్న వ్యక్తి యొక్క హక్కులను కూడా పరిగణించాలని సూచించింది. ఒకవేళ అరెస్ట్ చేయాలనుకుంటే అరెస్ట్ కు గల కారణాలు రిమాండ్ రిపోర్టు లో రాసి సి.ర్.పి.సి. సెక్షన్ 167 ప్రకారం కోర్టులో అట్టి వ్యక్తిని హాజరుపర్చాలి.తదనంతరం వారు బెయిల్ పై సెక్షన్ 437,438,439 ల ద్వారా బెయిల్ పై విడుదల కావొచ్చు.



**రాచకొండ ప్రవీణ్ కుమార్**
**న్యాయవాద,వరంగల్**
**949136909**



## భారీ వర్షాలతో అందరూ అప్రమత్తంగా ఉండాలి.

- **పార్టీ శ్రేణులు సహాయక చర్యల్లో ముమ్మరంగా పాల్గొనండి.**
- **భోజనం, తాత్కాలిక వసతి, బట్టల పంపిణీ, ఇతరత్రా పునరావాస ఏర్పాట్లతో బాధితులకు అండగా నిలబడండి.**
- **తెలుగుదేశం పార్టీ శ్రేణులకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపు.**

**హైదరాబాద్విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అదిలాబాద్, ఖమ్మం, భద్రాచలం, భూపాలపల్లి, ములుగు, కరీంనగర్, మహబూబాబాద్, తదితర గ్రామీణ జిల్లాల్లో నదులు, వాగులు, చెరువులు పొంగుతున్నందున రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో వరద ముంపుతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే హైదరాబాద్ మహా నగరం, నగర శివారు ప్రాంతాలు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని ద్వితీయ శ్రేణి నగరాల్లోని చెరువులు, నాలాలు పొంగి జనావాసాల్లోకి వరద నీరు చేరి ఇళ్లు, కాలనీలు మునిగిపోవడం వల్ల వరద ముంపుతో కాలనీల్లోకి నీరు చేరి నానా కష్టాలు పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వానలు, వరదల్లో చిక్కుకున్న సాటి ప్రజలను మానవతావాదంతో కాపాడి ఆదుకోవాల్సిన గురుతర బాధ్యత తెలుగుదేశం పార్టీగా మనందరిపై ఉన్నది. అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం భారీ వర్షాల మూలంగా నెలకొన్న వరద ముంపు, ఇతరత్రా విపత్కర పరిస్థితుల నుండి ప్రజలను బయటకు తీసుకువచ్చి బాధితులను ఆదుకునేందుకు అవసరమైన అన్నిరకాల సహాయక, పునరావాస చర్యల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ ముమ్మరంగా పాలుపంచుకోవాలి. ఆపదలో చిక్కుకున్న ప్రజలను కాపాడి వారికి తక్షణ వైద్య సహాయం అందించాలి. వరద ముంపు నుండి కాపాడబడ్డ బాధితులకు భోజన వసతి, బట్టల పంపిణీ, ఇతరత్రా సహాయక, పునరావాస చర్యలను స్థానికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. ఇలాంటి సహాయక చర్యలను పార్టీకి చెందిన అసెంబ్లీ నియోజకవర్గ, పార్లమెంటు, రాష్ట్ర స్థాయి నాయకులు పర్యవేక్షిస్తూ ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా తెలుగుదేశం పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ అప్రమత్తం చేయాలి. వరద సహాయక చర్యల్లో పాల్గొని తోటి ప్రజలను ఆదుకునేందుకు ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త ముందుకు వచ్చి బాధితులకు అండగా నిలిచి పేదల సంక్షేమం కోసం పుట్టిన మన పార్టీ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలి.




## అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి సత్యవతి రాథోడ్

- **పరిస్థితిపై సమీక్షస్తూ అధికారులకు సూచనలు**
- **- వరద ప్రభావిత ప్రతాల్లో బాధ్యతగా బాధితులకు అండగా నిలవాలి.**

**మహాబుబాబాద్ విశాలభారతి:** వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రతిపక్ష నాయకులు, యువత బాధితులకు అండగా నిలిచి సహాయం అందించాలని మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. లోతట్టు ప్రాంతాల్లో NDRF బృందాలను, రెస్క్యూ టీమ్ లు సిద్ధంగా ఉన్నాయని, భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేయాలన్నారు.సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అందరు ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుత సమయంలో ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా, పూర్తి అప్రమత్తతో విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు.యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా సత్వర చర్యలు తీసుకోవాలని, వరద ఉధృతి తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. 24 గంటలు కంట్రోల్ రూమ్ ను మానిటరింగ్ చేస్తూ,వర్ష ప్రభావిత ప్రాంతాల నుండి ఏదైనా సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా సిబ్బందిని సమాయత్తపర్చాలని మంత్రి అధికారులకు తెలిపారు.




## 81 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

**తెలంగాణ బ్యూరోవిశాల భారతి:** రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు 81 మంది పేర్లతో ఉన్న జాబితాకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పదోన్నతులు పొందిన వారిలో ఐదుగురు సచివాలయంలో విధులు నిర్వర్తించే సెక్షన్ ఆఫీసర్స్ కూడా ఉన్నారు. రెవెన్యూ సహా వివిధ శాఖల్లో ఖాళీలకు అనుగుణంగా 81 మందికి పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇప్పటికే 19 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు ఇవ్వగా... తాజా పదోన్నతులతో మొత్తం 100 మందికి పదోన్నతులు ఇచ్చినట్లు అయింది. 100 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కృతజ్ఞతలు తెలిపారు.

# మాఫియా పాలనకు చరమగీతం పాడండి

- **బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్.**
- **పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారు.**
- **ఇన్చార్జ్ సర్పంచ్ ని సస్పెండ్ చేయాలని డిమాండ్.**



**అసిఫాబాద్ విశాల భారతి:** సిర్పూర్ ప్రాంతంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాఫియా పాలనకు వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.బెజ్జూరు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం బీఎస్పీ నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు.బెజ్జూర్ ఇన్చార్జ్ సర్పంచ్,జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఇద్దరూ కుమ్మక్కై రూ.6 లక్షల పనులు చేసి, రూ.12 లక్షల గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన ఇన్చార్జ్ సర్పంచ్,జూనియర్ పంచాయతీ కార్యదర్శిలపై జిల్లా కలెక్టర్ తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపి సస్పెండ్ చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్,రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ నుండి తీసుకున్న రూ.97,449 కోట్లు రుణం అప్పుడే అప్పు తీర్చమని అబద్ధాలను చెబుతున్నారని విమర్శించారు. నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తీరితే అప్పు వివరాలను ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించి బయట పెట్టాలని డిమాండ్ చేశారు. దళిత బంధు పథకంలో రూ.3 లక్షలు లంచంగా తీసుకుంటున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ధర్నాలో నియోజకవర్గ ఇంచార్జి అర్షద్ హుస్సేన్,రాష్ట్ర కార్యదర్శి సిడెం గణపతి,జిల్లా ఇంచార్జి సోయం చిన్నయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్,జిల్లా కోశాధికారి నవీన్, బెజ్జూర్ మండల అధ్యక్షులు అత్రం సాయి,సూర్ల ఇస్తారి,పోచం, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జూర్ రోడ్లన్నీ బురదమయం: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్**
**రోడ్లకు మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలం**

బురదమయమైన ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్. ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో గురువారం ఆయన పర్యటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన రహదారులన్నీ గతుకులమయమై, బురదమయంగా మారాయన్నారు. వర్షం కురిస్తే అడుగు తీసి అడుగు పెట్టాలంటే ప్రజలకు కష్టంగా మారిందన్నారు. రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఉండడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రం నుండి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారిందన్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రోడ్లన్నీ బురుదమయమై అత్యంత అధ్వానంగా తయారైందన్నారు. గుంతల్లో నీరు నిలిచి ఎక్కడ ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు.రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దౌర్భాగ్య దుస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నియోజకవర్గ ఇంచార్జి అర్షద్ హుస్సేన్,రాష్ట్ర కార్యదర్శి సిడెం గణపతి,జిల్లా ఇంచార్జి సోయం చిన్నయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్, జిల్లా కోశాధికారి నవీన్, బెజ్జూర్ మండల అధ్యక్షులు అత్రం సాయి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులే

- **ఇది ముమ్మాటికీ బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే..**
- **టిపిసిసి సభ్యుడు డాక్టర్.లకావత్ లక్ష్మి నారాయణ నాయక్**



**దేవరుప్పులవిశాలభారతి:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న నలుమూలలో భారీ వర్షాలతో సంభవిస్తున్న వరదలతో ప్రజలు నరకాన్ని అనుభవిస్తున్నారని 'టిపిసిసి సభ్యుడు డాక్టర్ లాకావత్ లక్ష్మి నారాయణ నాయక్' తీవ్రంగా మండపడ్డాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని మొరంచవాగు వరద ఉధృతికి గ్రామమే మునిగిపోయిన పరిస్తితిని మనం చూశామని వరంగల్ నగరంలో రోడ్లపై 56 ఫీట్ల లోతు నీరు ప్రవహించి ఇండ్లలో చేరాయని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం,తొర్రూరు మండలంలో చెరువులకు గండ్లు పడే పరిస్థితులు ఉన్నాయని జనగామపాలకుర్తి మధ్యలో రాకపోకలకు అంతరాయం కలిగిందని అన్నారు.

కొన్ని చోట్ల పంటపొలాలు నీట మునిగి రైతులు కన్నీరు పెట్టుకున్నారని దేవరుప్పుల మండలం, మాధాపురం గ్రామంలోని దళితవాడలో 31రెండుపడకల గదుల నిర్మాణం కోసం ఉన్న ఇండ్లను కూల్చి 8నెలలుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఈ వర్షాకాలంలో నిలువ నీడ లేక అత్యంత దుర్భర జీవనం సాగిస్తున్నారని అందుకు స్థానిక మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నైతిక బాధ్యత వహించాలని పేర్కొన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం బడులకు సెలవులు ప్రకటించడం తప్పా ప్రకృతి వైపల్యాలను ఎదుర్కునే ప్రణాళిక లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు కనీస అవసరాలను తీర్చాలని డిమాండ్ చేశారు.





# పాలకుల నిర్లక్ష్యంతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి

- **టీపీసీసీ అధికార ప్రతినిధి అన్నేపర్తి జ్ఞాన సుందర్**

**శాలిగౌరారం,విశాల భారతి:** శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో టిపిసిసి అధికార ప్రతినిధి అన్నేపర్తి జ్ఞాన సుందర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అన్నేపర్తి జ్ఞాన సుందర్ మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో రోడ్లన్నీ అధ్వాన్నంగా మారాయని , స్థానిక శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ అక్రమంగా ఇసుక రవాణా పై పెట్టిన దృష్టి అభివృద్ధిపై పెట్టలేదన్నారు. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేయడంతో రోడ్లన్నీ అధ్వానంగా మారి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వంగమర్తి నుంచి చిత్తలూరు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి నూతన రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, పలు ప్రాంతాలలో వంతెనలు నిర్మాణం చేయకపోవడం మూలంగా రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వంతెనలను నిర్మాణం చేయాలన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తుంగతుర్తి నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ప్రజలు సైతం కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. అనంతరం రోడ్డుపై ఉన్న గుంతలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బెల్లి వీరభద్రం, గ్రామ శాఖ అధ్యక్షులు గుండెకిషోర్ నాయకులు నర్సిరెడ్డి సురేష్ ఉపసర్పంచ్ బాసని నాగయ్య బెల్లి గణేష్,అనిల్,రవి ,చందు, ఎల్లయ్య మల్లయ్య రాములు పాల్గొన్నారు.



# కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి

**నూతనకల్విశాలభారతి:** ఎడవల్లి గ్రామస్తుడైన వనం సైదులు కరెంట్ షాక్ తో మృతి చెందినట్టుగా నూతనకల్ ఎస్సై సిహెచ్ నరేష్ తెలియజేశారు. వారు మాట్లాడుతూ మృతుడు వనం సైదులు సుతారి మేస్త్రిగా పనిచేసేవాడు.పని ముగించుకొని మంగళవారం సాయంత్రం సుమారుగా ఏడు గంటల సమయంలో తన ఇంటికి వచ్చి స్నానం చేయడం కోసం తన అంగీని తీసి అక్కడే ఉన్నా దండెం తీగ మీద వేద్దామని దండెం తీగ పట్టుకోగా ఎర్త్ వైరు తన దండెం తిగకు అంటుకొని ఎడమ చేయికి కరెంట్ షాక్ కొట్టి స్పాట్ డేట్ అయ్యాడు అని. బుధవారం ఉదయం తన తమ్ముడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా ఎఫైర్ నమోదు చేసి మృతునికి పోస్టు మార్టం జరిపించి మృతుణ్ణి తన కుటుంబ సభ్యులకు అప్పగించినట్లుగా పోలీసు వారు తెలియజేశారు.






## జోరు వానలో తడుస్తూ పరిస్థితులను

# పరిశీలించిన మంత్రి వేముల

**బాల్కొండ-విశాలభారతి:**

ఏకధాటిగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా, బాల్కొండ నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సీఎం కేసిఆర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేస్తున్నారు.ప్రకృతి వైపరిత్యాలు అడ్డుకోలేం కానీ నష్టాన్ని నివారించగలం అంటూ జిల్లా వ్యాప్తంగా అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ ప్రాణనష్టం జరగకుండా పరిస్థితులు చక్కదిద్దుతున్నారు.జిల్లాలో నెలకొని ఉన్న తాజా పరిస్థితుల గురించి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో సమీక్షించారు.అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్నస్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు.పరిస్థితి అదుపులోనే ఉందని, ఎక్కడ కూడా ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లడం వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రి దృష్టికి తెచ్చారు.ప్రధాన జలాశయాలైన శ్రీరాంసాగర్,నిజాంసాగర్ ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున వరద ప్రవాహం వస్తున్నందున ఏ క్షణంలోనైనా వరద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రం సమీపంలో నిజాంసాగర్ కెనాల్ పై నివాసాలు ఏర్పరచుకున్న సుమారు 400 కుటుంబాలను తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. రామడుగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిని సంతరించుకుంటున్నందున దిగువ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ఏరియాలో శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ప్రవహించే ప్రదేశాల్లో ఎవరు కూడా చేపలు పట్టేందుకు వెళ్లకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుండి ఎస్సారెస్పీ లోకి భారీగా ఇన్ ఫ్లో వస్తున్నందున తల్వేద, మారంపల్లి,నూత్ పల్లి,బాద్గుణ తదితర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. కంట్రోల్ రూమ్ లలో ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా అధికారులు,సిబ్బందిని సమాయత్తపర్చాలని మంత్రి సూచించారు. వేల్పూర్ మండల కేంద్రంలో అదే విధంగా ఆర్మూర్ నుండి జగిత్యాల్ కు వెళ్లే జాతీయ రహదారి వద్ద,పడగల్ గ్రామానికి వెళ్లే దారిలో చెరువులు తెగి వరదలు రోడ్ల పై నుండి పారుతుండటంతో ప్రభావిత ప్రాంతాలను గురువారం వేకువ జామున్నే మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు.కమ్మర్ పల్లి మండల కేంద్రములోని కేజీబివి స్కూల్ చుట్టూ వరద నీరు చేరడంతో విద్యార్థినులను అక్కడనుండి పక్కనే ఉన్న ఎంపీడిఓ ఆఫీస్ కి తరలిచడంతో వారిని కలిసి మంత్రి వేముల ధైర్యం చెప్పారు.వారికి భోజన సౌకర్యం ఇతర అవసరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు,స్థానిక సర్పంచ్ కి సూచించారు.వరద తగ్గాక వారి స్వస్థలాలకు పంపించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



# చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

**ఆర్మూర్విశాలభారతి:** చేపల వేటకు వెళ్లి నందిపేట మండలంలోని కౌల్పూర్ గ్రామానికి చెందిన పోషమోళ్ల ఎల్లన్న (35) గుంతలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.భారీ వర్షాలకు చెరువుల అలుగులు పారడంతో నందిపేట్ మండలంలోని కుదాన్పూర్ చెరువు లో చేపలు పట్టడానికి వెళ్లి చనిపోయాడు మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు, ఎల్లన్న మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



# రైతులకు అన్ని రకాల సేవలను అందించడానికి కిసాన్ సేవా కేంద్రాలు

**శంకరంపేట్ విశాలభారతి:** నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట్ రైతులకు కావలసిన అన్ని రకాల సేవలను ఒకే చోట అందించడానికి కేంద్ర ప్రభుత్వం కిసాన్ సేవా కేంద్రాలను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించినట్లు పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షులు కోణం విఠల్ పేర్కొన్నారు.. గురువారం ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా 2.8 లక్షల కిసాన్ సేవా కేంద్రాలు ను అప్ గ్రేడ్ చేయనుండగా తొలి దశలో 1.25 కిసాన్ సేవా కేంద్రాలను ప్రారంభించగా ఈ కార్యక్రమాన్ని పేటలోని గ్రోమోర్ సెంటర్లో టీవీ ద్వారా ప్రధాని మోడీ ప్రసంగాన్ని మండల బిజెపి నాయకులు రైతులు వీక్షించారు.. నాణ్యమైన విత్తనాలు ఎరువులు ఫర్టిలైజర్స్ భూసార పరీక్షలు.. ఇలా రైతులకు కావాల్సిన అన్ని సేవలను ఒకే చోట అందించడానికి కిసాన్ సేవా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు బండల శ్రావణ్ కుమార్ మంగలి కృష్ణ దమ్ము సాయిలు.. బుగుడాల కృష్ణ ఆయ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులుగా

# సాయిలు పటేల్ నియామకం

**నారాయణఖేడ్ విశాలభారతి:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సాయిలు పటేల్ ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులుగా నియమించినందుకు పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి జహీరాబాద్ మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ షెట్కర్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలుపు కోసం సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.



# వర్షా ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి.**



**మేడిపల్లివిశాలభారతి:** పీర్జాదిగుడా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25 వ డివిజన్ లోని విహారికా కాలనీ, సాయి నగర్, క్రాంతి కాలనీ లలో డివిజన్ లోని గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రోడ్ల పై నీరు నిలిచి కాలనీ వాసులకు, వాహన దారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సమాచారం అందడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి కాలనీలను సందర్శించి మాన్ సూన్ టీమ్ ను రంగలోకి దింపి ఎక్కడ వర్షం నీరు నిల్వకుండా మున్సిపల్ మ్యాన్ హోల్స్ ఓపెన్ చేసి నీటిని తొలగించారు. అలాగే సాయినగర్ అనురాధ అపార్ట్మెంట్ దగ్గర రైన్ వాటర్ కోసం పైప్ లైన్ పనులు జరుగుతుడంతో ప్రస్తుతం ఏటువంటి ఇబ్బంది లేకుండా సాఫీగా నీరు వెళ్తున్నాయని అన్నారు. భారీ వర్షాలు, మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సూచించిన క్రమంలో డివిజన్ వాసులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అదే విదంగా విద్యుత్ స్తంభాలు, పురాతనమైన ఇళ్లకు దూరంగా ఉండాలని, అత్యవసరంగా ఏదైనా ప్రమాదాలు పొంచి ఉంటే తాను 24 గంటలు మీకు అందుబాటులో ఉంటానని తనకి సమాచారం అందించాలని తెలిపారు.





## రత్నవరం వాగుపై వంతెన నిర్మించడంలో

# అధికారులు ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం..

- **తెల్లబల్లిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి.**
- **పలువురికి ఆర్థిక సహాయం అందించిన.**
- **డాక్టర్ అంజి యాదవ్**

**నడిగూడెంవిశాలభారతి:** మండల పరిధిలో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు బిక్కుబిక్కుమంటూ రోడ్లు దాటుతున్నారని డాక్టర్ అంజి యాదవ్ అన్నారు.గురువారం 9వ రోజు మన ఊరుకు మన గడపకు మన అంజన్న అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని రత్నవరం,తెల్లబెల్లి,ఈకే పేట,రామాపురం,చాకిరాల,శ్రీరంగాపురం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రత్నవరం వాగుపై గత 20 సంవత్సరాలుగా వంతెన నిర్మించకపోవడం వలన వర్షాకాలంలో గ్రామస్తులు రైతులు రోడ్డు దాటాలంటే భయపడుతూ రోడ్డు దాటుతున్నారని అన్నారు.ఈ వాగుపై వంతెన నిర్మించకపోవడం వలన నడిగూడెం మండల కేంద్రానికి గ్రామస్తులు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే సంబంధిత అధికారులు ఈ వాగుపై వంతెన నిర్మించి గుంటల గుంటలుగా ఉన్న రోడ్లను నూతనంగా వేయాలని అన్నారు.తెల్లబెల్లి గ్రామంలో టిడిపి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించారు.వారు ఆర్థికంగా లేకపోవడం వలన ఇల్లు నిర్మించుకోలేకపోయారుఅదే ఇళ్ల స్థలాలలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్మించడానికి ప్రభుత్వం పేద ప్రజల నుండి ఆ ఇళ్ల స్థలాలను తీసుకుంటుందని అన్నారు.గత కొద్ది రోజుల క్రితం ఆ స్థలాలలో గుడిసెలు వేసుకున్న ప్రజలపై అక్రమ కేసులు బనాయించారని ప్రజలు తెలిపారని అన్నారు.తక్షణమే అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతున్నకొంతమందికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజశేఖర్ నాయుడు దేశినేని,తోట కమలాకర్,రామలక్ష్మణ,కరుణాకర్, పవన్,వెంకటేష్ బాబు,నవీన్,మాలోవత్ బాలు,బండి గోపి,జగ్య, బాణావత్ రాజా,సాయి, సంతోష్ ,గోపి,సునీత,రమణి,నవీన్,అభినవ్,పవన్,నందు,చంటి తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం డీ కొని వ్యక్తిమృతి.

**నూతనకల్ విశాలభారతి:** గుర్తు తెలియని వాహనం డీ కోని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెదనెమిల గ్రామ శివారులో 365 జాతీయ రహదరిపై గురువారం తెల్లవారు జామున జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదనెమిల గ్రామానికి చెందిన రాచకొండ విప్లవ (35) మరిపెడ బంగ్లా నుండి తన బైక్ పై స్వగ్రామానికి వస్తున్నాడు.గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం వెనుక నుండి డికొట్టడంతో క్రింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.రహదారి పై వెళ్తున్న స్థానికులు 100కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని బార్య జ్యోతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శవ పంచనామా అనంతరం పోస్ట్ మార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా హాస్పిటల్ కు తరలించినట్లు ఎస్ ఐ సలిగంటి నరేష్ తెలిపారు.



# రామస్వామికి నివాళులర్పించిన శాసన మండలి చైర్మన్, ఎమ్మెల్యే

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన మందుగుల రామస్వామి అనారోగ్యానికి గురై చనిపోవడంతో వారి పార్థివ దేహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య లు పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీటీసీ పోలగొని స్వామి తెలంగాణ ఉద్యమకారుడు జన్నపాల శ్రీనివాస్ వేముల లింగయ్య మర్రి రమేష్ మర్రి అశోక్ తదితరులు నివాళులర్పించారు.



# బజార్ అయ్యా దశదినకర్మకు హాజరైన మంత్రి

**పెన్పహాడ్ విశాలభారతి:** మండల పరిధిలోని ధూపాడ్ లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బిఆర్ఎస్ నాయకుడు దొంగరి బజార్ అయ్యా దశదిన కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి గురువారం బజార్ అయ్యా చిత్రపటానికి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులను ఓదార్చినారు వారి వెంట రాష్ట్ర ఉన్నత విద్యా మండలి డైరెక్టర్ వంటేద్దునరసింహారెడ్డి పిఎసిఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి,నాతాల జానకి రామ్ రెడ్డి,జిల్లా నాయకులు మామిడి అంజయ్య,మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగేందర్, సర్పంచ్ నాగేశ్వరరావు,శ్రీనివాస్ రెడ్డి,గుగ్గిల సోమయ్య, తురక భద్రయ్య,రాంబాబు, నాగార్జున వెంకన్న,జడ వీరయ్య, కత్తి ఉపేందర్,మాతంగి అరవిందు, హుస్సేన్,తదితరులు పాల్గొన్నారు.




# పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికు పుత్రశోకం

- ఎమ్మెల్యే తనయుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి మృతి
- శోకసంద్రమైన పటాన్ చెరు నియోజకవర్గం
- నివాళులర్పించిన మంత్రులు మహమ్మద్ అలీ, హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి
- అందరిని తీవ్రంగా కలిచి వేసిన ఎమ్మెల్యే జీఎంఆర్ అర్ధనాథాలు
- ఎమ్మెల్యే సొంత స్థలంలో అంత్యక్రియలు

**పటాన్ చెరు, విశాలభారతి:** పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పుత్రశోకంలో మునిగిపోయారు. అనారోగ్యంతో ఎమ్మెల్యే పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి (35) గురువారం ఉదయం హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో మృతి చెందాడు. కుమారుడి మరణంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తో పాటు కుటుంబ సభ్యుల రోదనలు అందరిని తీవ్రంగా కలచి వేస్తున్నాయి. ఆయన మృతితో పటాన్ చెరులో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. అందరితో కలిసి మెలిసి ఉంటూ ఆప్యాయంగా పలకరించే విష్ణువర్ధన్ రెడ్డి మరణ వార్తతో సన్నిహితులు, స్నేహితులు బంధుమిత్రులు కన్నీరు పెట్టుకుంటున్నారు. పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. మృతుడికి భార్య కిరణ్మయితో పాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. అలాగే సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి సంబంధించిన సొంత స్థలం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ పక్కన అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి పార్థివ దేహానికి తండ్రి గూడెం మహిపాల్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో రాష్ట్ర మంత్రులు మహమ్మద్ అలీ, తన్నీరు హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి, మహిళా కార్పొరేషన్ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, మదన్ రెడ్డి, మాణిక్ రావు, జిల్లా కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కుర్ర సత్యనారాయణ, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.






## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డినుపరామర్శించిన.. బీజేపి నేతలు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు

**పటాన్ చెరు, విశాలభారతి:** పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిను బీజేపి నేతలు, ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు పరామర్శించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి (35) అనారోగ్యంతో గురువారం ఉదయం హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో మృతి చెందాడు. సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి సంబంధించిన సొంత స్థలం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ పక్కన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి ఈటెల రాజేందర్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పరామర్శించి, ఆయనకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట బీజేపి నేతలు గోదావరి అంజిరెడ్డి దంపతులు ఉన్నారు.



## భారీ వర్షా లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పాలకుర్తిలో వరద పరిస్థితిని సమీక్షించిన మంత్రిఎర్రబెల్లి**

**పాలకుర్తి, విశాలభారతి:** జనగామ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల మూలంగా పాలకుర్తి మండలంలో దర్దేపెల్లి,మల్లంపల్లి వావిలాల తొర్రూరు వెల్లేదర్దేపల్లి కల్వర్ట్ వద్ద అధికారులు, ప్రజలతో కలిసి పలు ప్రాంతాలలో వరద పరిస్థితిని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి.దయాకర్ రావు పరిశీలించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు,జిల్లా కలెక్టర్ పోలీసు అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు,
అధికారులు కూడా ఎటువంటి పరిస్థితులు ఎదురైన తట్టుకునే విధంగా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప,ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.చేపలు పట్టడానికి బయటికి వెళ్ళొద్దని విద్యుత్ తో అప్రమత్తంగా ఉండాలని మంత్రి ప్రజలకు విన్నపం చేశారు, అధికారులను ఆదేశిస్తూ తాను నియోజక వర్గంలో పర్యటిస్తూ, ప్రజల్లో ధైర్యం నింపుతున్నారు. మంత్రి వెంట ఎమ్మార్వో పాల్ సింగ్ ఎస్సై శ్రీకాంత్ అధికారులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యలకు పరిష్కారం చెయ్యి గుర్తుతోనే

**పాలేరు, విశాలభారతి:** కెసిఆర్ మాటలు నీటి మీద రాతలే అని పాలేరు టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు అన్నారు. పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం రాజారాం, ఎలువారిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. కేసీఆర్ ను గద్దె దింపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ, 5వందల రూపాయలుకే గ్యాస్ ఇస్తామని ఆయన తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని దొంగలించిన దుండుగలు

**పాలేరు, విశాలభారతి:** పార్కు చేసిన బైకు దొంగిలించిన సంఘటన కూసుమంచి మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి
ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, చౌటపల్లి గ్రామానికి చెందిన గాజుల నాగరాజు తండ్రి ముత్తయ్య "TS 04 ED 7229 నంబర్ గల సిమెంట్ కలర్ గ్లామర్ బైక్ చౌటపల్లి గ్రామం చెరువుకు వెళ్లే దారిలో దొండు బండ దగ్గర గురువారం పార్కు చేశారు. వచ్చేసరికి బైక్ లేకపోవడంతో స్థానిక స్టేషన్లో కంప్లైంట్ చేశాడు.అయితే చెరువు దగ్గర చాపలు పట్టేందుకు, చూసేందుకు వచ్చినవారే దొంగిలించారని అనుమానం వ్యక్తం చేశాడు. స్థానిక పోలీసులు క్షేత్రస్థాయిలో ఎంక్వైరీ చేసి నిందతుడిని గుర్తించాలని కోరాడు.




## సైడ్ కాలువలు లేక నిలిచిన వరద నీరు

**నూతనకల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని సూర్యాపేట దంతాలపల్లి రహదారి పునర్నిర్మాణంలో భాగంగా కొన్ని నెలల క్రితం సిసి రోడ్లు పునర్నిర్మాణ పనులు చేపట్టి రోడ్లువేశారు. కానీ సైడ్ కాలువలు నిర్మించకపోవడంతో గత రాత్రి కురిసిన వర్షాలకు భారీ ఎత్తున వరద నీరు రోడ్డు వెంబడి ఉన్న దుకాణాలలోకి వెళ్లి సరుకులన్నీ తడిచిపోయాయి. నిబంధనల ప్రకారం రోడ్డుకు ఇరువైపులా సైడ్ కాలువలు నిర్వహించాలి కానీ రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులు తూ తూ మంత్రంగా రోడ్డు నిర్మాణ పనులు ముగించుకొని వెళ్లిపోవడంతో వరదనీరు దుకాణాలకు చేరి అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక చిరు వ్యాపారస్తులు ఆవేదన చెందారు. దుకాణాల ముందు వరద నీరు నిలవడంతో చేసేదేమీ లేక జెసిబి సహాయంతో రోడ్డుకు ఒకవైపు కాలవ తీసి వరద నీరు బయటకు పోయేలాగా చేశారు .ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు తమ పరిస్థితిని అర్థం చేసుకొని రోడ్డుకు ఇరువైపులా సైడ్ కాలువ నిర్మించాలని చేరి వ్యాపారస్తులు కోరుతున్నారు.



## డోర్నకల్ ప్రజలు ఆశీర్వదిస్తే చేతల్లో చూపిస్తా

- పేదల సమస్యలు పరిష్కరించడమే నా ధ్యేయం
- పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తా
- కిషన్ పరివార్ వ్యవస్థాపకుడు నవావత్ భూపాల్ నాయక్

**మహబూబాబాద్, విశాల భారతి:** డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తే మాటల్లో కాదు చేతల్లో చూపిస్తానని కిషన్ పరివార్ వ్యవస్థాపకుడు ననావత్ భూపాల్ నాయక్ అన్నారు.సీజన్ హాస్పటల్, మితెరా ఫార్మా సహకారంతో కిసాన్ పరివార్ వ్యవస్థాపకులు ననావత్ భూపాల్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో పేదలకు ఉచితంగా ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరించి మంచి చెడులు అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన భూపాల్ నాయక్ మాట్లాడుతూ మా తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారని, నిరుపేద కుటుంభంలో పుట్టిన నేను పెడలకష్టాలు తెలుసన్నారు. అనేక వ్యాపారం చేస్తూ పేదలకు సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారు. పేద ప్రజల పేదరికాన్ని చూసి వైద్య శిబిరం నిర్వహించాలనే ఉద్దేశంతో పేదరికంతో వైద్యం చేయించుకోలేక ఉన్న నిరుపేదలకు అందుబాటులో ఉండి వారికి సహకరిస్తానని వారన్నారు. డోర్నకల్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. నేను మాటలు చెప్పేవాడిని కాదు చేతలు చేసేవాన్ని ప్రజలకు సేవ చేయడంలో ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రజాసేవే నా ధ్యేయం ప్రజల కోసం ఎల్లప్పుడూ పనిచేస్తానని ఆయన చెప్పారు. ఉచిత సేవలు ప్రజల కోసం మరెన్నో సేవలు డోర్నకల్ ప్రజలకు అందిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీజన్ హాస్పిటల్, మిత్రా ఫార్మా సంయుక్తంగా ప్రముఖ వైద్యులచేత ఉచిత వైద్య శిబిరమును డోర్నకల్ నియామకవర్గంలోని కురవి మండల కేంద్రములో ఎర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు. అరుదైన రక్తనాళాల చికిత్సకై ఉచిత శిబిరంలో వైద్య చికిత్సకు సంబంధించి వైద్యశిబిరం ను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. కురవి మండలంలో మొట్టమొదటి సారిగా సస్క్యులర్ రక్తనాళాల టెస్టులను ఉచితంగా నిర్వహించడానికి అభినందనీయమన్నారు. హైదరాబాద్ లోని సీజన్ హాస్పిటల్, మిత్రా ఫార్మా సంయుక్తంగా వారు ఉచితంగా డాప్లర్ టెస్టులను నిర్వహించనున్నారని, ఈ అవకాశాన్ని మండలంలో ఉండే ప్రజలంతా వినియోగించుకోవాలని భూపాల్ నాయక్ కోరారు. అంతేకాకుండా ఇదే వైద్య శిబిరంలో అనేక రకాల టెస్టులకు సంబంధించి ఉచితంగా సేవలు అందించనున్నారని, జనరల్ ఫిజీషియన్ పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులకు సంబంధించిన మెడిసిన్స్ కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్, రాజు, దాసు, ప్రభాకర్, రమేష్, సీనియర్ జర్నలిస్ట్ డివై గిరి, ఎల్హెచ్పిఎస్ నాయకులు భీమా నాయక్, వినోద్ నాయక్, గుగులోత్ ప్రకాష్ నాయక్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.



## సింగరాజు పల్లి నుండి రామరాజు పల్లి రహదారి బంద్

**దేవరుప్పుల, విశాలభారతి:** గత రెండు,మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దేవరుప్పుల మండలం,సింగరాజు పల్లి నుండి నీర్మాల,రామరాజు పల్లి గ్రామాలకు వెళ్ళే రోడ్డులో నీటి ఉధృతి ఎక్కువై బ్రిడ్జి పై నుండి ప్రవహిస్తుండగా రాకపోకలకు అంతరాయం కలిగింది. అందులో భాగంగానే ఈ రోజు మండల తహశీల్దార్ ఎడ్ల రవీందర్ రెడ్డి,వైస్ ఎంపిపి కత్తుల విజయ్ కుమార్ రెడ్డి,సర్పంచ్ గోపాల్దాస్ మల్లేశ్,ఆర్ఐ. రాజు లతో పరిశీలించిన ఆర్డీవో మురళి కృష్ణ.





## గ్రామపంచాయతీ వర్కర్స్ కలెక్టరేట్ ముందు ధర్నా

**పాలేరు, విశాలభారతి:** గ్రామపంచాయతీ సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ఖమ్మం కలెక్టరేట్ ను ముట్టడించారు. 22వ రోజు సమ్మెలో భాగంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కలెక్టరేట్ ను ముట్టడించారు. తిరుమలాయ పాలెం మండలం 40 గ్రామాలకు చెందిన కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అనునిత్యం గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని పరితపించే మాకు రేపు ఏదైనా రోగాల బారిన పడితే కనీసం ప్రభుత్వా లబ్ధి లేక కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఏమాత్రం జాలి చూపని ఈ ప్రభుత్వం ప్రజల బాగోగుల గురించి మాట్లాడుతుంటే హాస్యపదంగా ఉందన్నారు. వెంటనే ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ పాషా, బషీర్, సంగాయ్య, సైదులు, శ్రీను, రాములు, మల్సూర్ అలి పాల్గొన్నారు.



## ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి ఘనంగా నివాళులు

**వనస్థలిపురం, విశాలభారతి:** భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డా. ఏపిజె అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద స్ఫూర్తి సేవా సమితి ఆద్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం BRS పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ గురువారం డా.అబ్దుల్ కలాం విగ్రహనికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ రక్షణశాఖలో శాస్త్రవేత్తగా దేశానికి ఎంతో సేవచేశారని, 2002 నుండి 2007 వరకు భారత 11వ రాష్ట్రపతిగా పనిచేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సమితి అద్యక్షులు కొలిశెట్టి సంజయ్ కుమార్, బీరం శ్రీదర్, స్ఫూర్తి సేవాసమితి ప్రతినిధులు పెండ్యాల యాదగిరి, బాస్కర్, దేవదాస్, శ్రీనివాస్, అంజయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు..



# పేదింటి ఆడబిడ్డకు అండగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్

- షాదీముబారక్ చెక్కులతో పేద ప్రజలకు ఆసరాగా నిలిచాం
- ఎమ్మెల్యే భగత్
- నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి పథకం
- కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**హలియా,విశాలభారతి:** కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డలకి అండగా నిలుస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. అనుముల మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులని హలియ లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భగత్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ


తెలంగాణ రాష్ట్రం ఎర్పాటు అయ్యాకా సిఎం కేసీఆర్ పేద ఆడపిల్లల పెండ్లికి బారం కావద్దని పేద ఆడబిడ్డల కోసం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలని ప్రవేశపెట్టి ఆర్ధికంగా చేయుతనందిస్తూ పేద ఆడ బిడ్డల పెళ్ళిళ్ళకి పెద్దన్నగా మారాడని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారని అన్నారు. పేదల కోసం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి వంటి అనేక పథకాలను అర్హులైన ప్రజలు ఆస్వాదిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం ఏనాడు ఆలోచించలేదని, ఆడ పిల్లల పెళ్లిళ్లు చేయాలంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా ఉండేదని, కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆడబిడ్డల పెళ్లిళ్లకు 1లక్ష 116 రూపాయలు అందించి వారి కుటుంబంలో ఒకరిగా ఉన్న ఏకైక గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. అనంతరం 6 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిది నుండి 6లక్షల 60వేల రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులని అందజేశారు. ఈ కార్యక్రమం లో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ చైర్మన్ జవాజీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ గౌరవ సలహాదారుడు వెంపటి శంకరయ్య,ఎమ్మార్వో మంగా, మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్గొండ సుధాకర్,ప్రధాన కార్యదర్శి యనమల సత్యం,పట్టణ కార్యదర్శి దొరపెల్లి వెంకన్న, మార్కెట్ డైరెక్టర్లు పోశం శ్రీనువాస్ గౌడ్, సురభి రాంబాబు,శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ లు బిళ్ళకంటి శ్రీను, నాగరాజు, కోఆప్షన్ నెంబర్ షేక్ సమీనా అన్వరుద్దిన్, దేవస్థానం చైర్మన్ రామ లింగయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# వేములూరు ప్రాజెక్టు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మఠంపల్లి మండలాధికారులు

**మఠంపల్లి,విశాలభారతి:** మండల పరిధిలోని యాతవాకిళ్ళ గ్రామంలో గల వేములూరు ప్రాజెక్టు గత మూడు రోజులుగా కురుస్తున్న వానలకు ప్రవాహం ఎక్కువ అవ్వడంతో గ్రామ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రాజు మండలాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మండలం లోని తహసిల్దార్ సాయ గౌడ్ ఎంపీడీవో జానకి రాములు ఎం పీ ఓ ఆంజనేయులు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ గ్రామాన్ని చేరుకొని నీటి ప్రవాహాన్ని పరిశీలించి గ్రామస్తులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి గ్రామపంచాయతీ వార్డ్ నెంబర్స్ కొత్తూరు వెంకన్న మఠంపల్లి రైతు సమన్వయ సమితి డైరెక్టర్ కాటాల లింగరాజు బీసీ సెల్ అధ్యక్షులు ఎల్లవుల నాగయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలి

**ఎంపిపి పెండెం సుజాత శ్రీనివాస్ గౌడ్**

**గరిడేపల్లి, విశాలభారతి:** ప్రతి ఇంటికి ఆరు మొక్కల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలి ఎంపిపి పెండెం సుజాత శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎం.పి.పి పెండెం సుజాత శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఉపాధిహామీ పథకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశంలో హరితహారం,పండ్ల తోటల పెంపకం గురించి ,వాటికి ప్రభుత్వం అందించే రాయితీల గురించి గ్రామాల్లో రైతులకు తెలియచేసి లబ్దిదారులను గుర్తించాలని అన్నారు . అలాగే మంచి వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని, ఇంటింటికీ 6 మొక్కల పంపిణీ కార్యక్రమం కూడా పూర్తి చేయాలని తెలియచేయడం జరిగింది. ఎం.పి.డి.ఓ వనజ, ఎం.పి.ఓ మౌలానా, ఏ.పి.ఓ సురేష్, టి. ఏ లు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

# రామన్నపేట ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్.ఐ లక్ష్మయ్య
- మూసి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రామన్నపేట విశాలభారతి;** రామన్నపేట మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్. ఐ లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాబోవు 48 గంటల లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి అని వాతావరణ శాఖవారు హెచ్చరించిన నేపథ్యంలో వాగులు, చెరువులు, కుంటలు పొంగి పొర్లే ప్రమాదం ఉందని ప్రజలు ఏదయినా ప్రయాణాలు (టూర్లు) ముందే అనుకొని ఉంటే అట్టి ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. అత్యవసరం అయితే తప్ప ఇంట్లో నుండి బయటకు రావొద్దని రోడ్ల పై నుండి వరద నీరు వెళ్లే ప్రమాదం ఉంది అలా వరద నీరు ప్రవహిస్తున్నపుడు ప్రజలు నిర్లక్ష్యంగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లక్ష్మాపురం వాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నదని మూసి పరివాహక ప్రాంత మరియు లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చెట్ల కింద, పాడైన భవనాల



కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండకూడదని విద్యుత్ స్తంభాలని ముట్టుకోరాదని చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తలు వహించాలని వర్షాల వల్ల ఏదయినా సమస్య వస్తే వెంటనే 100 నంబర్ కి గాని, 8712662487 (ఎస్ ఐ రామన్నపేట) నెంబర్ కి కాల్ చేయగలరు.

# త్యాగాలకు ప్రతీక పీర్ల పండుగ





- వీరులకు ప్రతీకగా మొహరం
- హాసన్ హుస్సేన్ లని స్మరిస్తూ జరిపే పండుగ
- పాప ప్రాయచ్చిత్తమే పండుగ ఆంతర్యం
- మోక్షం ప్రసాదించమని కోరుతూ మొహరం పండుగ
- మొహరం పండుగ సందర్భంగా ప్రత్యేక కథనం

**చిట్యాల, విశాలభారతి:**

మొహరం పండుగ అంటే

ధర్మ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరులకి ప్రతీకగా హస్తం ఆకృతి కలిగిన రూపాలని తయారుచేసి వాటిని అలంకరించి ఊరేగించి పూజించే వాటిని పీర్లు (మొహరం) అని పిలుస్తారు. మొహరం పండుగ అంటే గ్రామీణ ప్రాంతాలలో చాలామందికి తెలియదు పీర్ల పండుగ అంటే తెలియని గ్రామం అనేది లేదు. పీర్ల పండుగ వచ్చిందంటే డప్పు చప్పులతో పీరీలని ఊరేగింపుగా తిప్పుతుంటే మతాలకతీతంగా అందరు పీరీలని మొక్కుతారు. ఇంటికి పీరీలు రాగానే ఊదు, బెల్లం, సమర్పిస్తాము. సల్లని దీవెనలు ఉండాలి దేవుడా అని బిందెలో నీల్లారబోసి మొక్కుతం. తెలంగాణలో మతాలకి అతీతంగా పీర్ల పండుగని జరుపుకుంటారు.

**మొహరం పండుగ అంటే ఏమిటి..**

మొహరం మాసం ఆరంభం రోజున ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఇది అరబిక్ కేలండర్ యొక్క మొదటి నెల ముస్లింలు మొహర్రం నెలలో మొదటి పది రోజులను విషాద దినాలుగా పాటిస్తారు. నల్ల దుస్తులు ధరించి సంతాపం పాటిస్తారు. హస్సన్,హుస్సేన్ వీరోచిత పోరాటానికి సంబంధించిన జ్ఞాపకాలని గుర్తు చేసుకుంటారు. చాలా మంది పీరీలు అంటే ఏంటో తెలుసుకోవలనుకుంటారు. నిజానికి పీరీలు అంటే ముస్లిం త్యాగ మూర్తుల జ్ఞాపకంగా భావించే జెండాలు వీటినే దట్టీలు అని కూడా అంటారు. ఆ జెండాలనే పవిత్రంగా భావించి దేవుడుగా కొలుస్తారు.

పంజా, హస్తం, నెలవంక వంటి ఆకారాలు జెండాలో ఉంటాయి. మొహర్రం నెలల్లో చంద్రుడు స్పష్టంగా కనిపించిన, ఐదవ రోజు రాత్రి బాంజోఖ పీటారా లేదా తబుధ్ అనే బంజాల్ లో ఉంచిన పెట్టేను పీర్ల మసీదుకు ఊరేగింపుగా తెస్తారు. ఆ బంజాలకు, విగ్రహాలకు పది రోజులు ఫాతిహాలు జరుగుతాయి.

**మొహరం పండుగని ఎందుకు జరుపుతారు....**

కొన్ని ఏళ్ల క్రితం హిజ్రీశకం 60 లో జరిగిన యదార్ధ ఘటనకు ప్రతి రూపం. మహనీయులు మహమ్మద్ ప్రవక్త అల్లాహ్ నుండి దైవవాణి గ్రహించి దానిని దివ్యఖురానుగా గ్రంథస్తం చేశారు. ఇస్లాం ప్రపంచ వ్యాప్తంగా ఆయన అడుగు జాడల్లో విస్తరించింది. ఈ నేపథ్యంలో అప్పటి ఇస్లాం రాజ్యాధిపతి యాజిద్ సిద్ధాంతాన్ని ధిక్కరించి ఇస్లాంలో తన సిద్ధాంతాన్ని జోడించడంతో మహమ్మద్ ప్రవక్త మనవడు హాజరత్ ఇమామ్ హుసైన్ దాన్ని ఎదిరించారు. దీంతో కుటుంబ సభ్యులు 72 మంది అంతా యుద్ధ మైదానంలో నిలబడవలసి వచ్చింది. ఇహ లోకం కంటే పరలోకమే మేలని ప్రాణత్యాగానికైనా సిద్ధమని నిలబడ్డారు. ఎట్టి పరిస్థితిల్లోనూ ఇస్లాం సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మాట్లాడాలని అని యాజిద్ బలవంతం చేస్తాడు. శాంతి కోసం హుస్సేన్ చేసిన ప్రతిపాదనలను యజీద్ తోసిపుచ్చి యుద్ధం ప్రకటించడంతో.మొహర్రం నెల ఒకటో రోజున ఇరాక్‌లో కర్బలా మైదానంలో యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధంలో యజీద్ సైన్యం హుస్సేన్ తో పాటు అతని కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేసి మహిళలు, పసి పిల్లలను సైతం పాశవికంగా హతమార్చింది. మొహర్రం నెల 10వ రోజు సాయంత్రం నమాజ్ చేస్తున్న సమయంలో ఇమాం హుస్సేన్‌ను శత్రుసైన్యం చుట్టుముట్టింది. ప్రార్థనలో భాగంగా సజ్దా చేస్తున్న సమయంలో భూమిపై తల ఆన్చడంతో వెంటనే శత్రు సైన్యం హుస్సేన్ శిరస్సును ఖండించింది. హుస్సేన్ తలతో సైన్యం ఊరేగుతూ విజయోత్సవం జరుపుకుంటుంది. హజ్రత్ హుస్సేన్ ఆ తెగకు శాపం పెడతారు. ఈ తెగకు ఎప్పటికీ మోక్షం ఇవ్వొద్దని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ప్రాణాలు విడుస్తాడు. యుద్ధానంతరం యజిద్ తెగకు చెందిన వారు పశ్చాత్తాపం చెంది దేవుడా మేం తప్పు చేశాం దైవ ప్రవక్త మహ్మద్ ప్రవక్త వంశానికి చెందిన వారిని మా చేతులతో హతమర్చాం కాబట్టి మమ్మల్ని మన్నించమని గుండెల మీద చేతులతో బాదుకుంటూ బిగ్గరగా ఏడుస్తూ నిప్పులపై నడుస్తారు.



## మొహరం పండుగని ఎలా జరుపుతారు...

**పీర్ల పండుగ వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాలలో అందరు మొక్కులు చెల్లించుకుంటారు. కొన్ని గ్రామాలలో కొన్ని కులాలకు ప్రత్యేక పీరీలు ఉంటాయి. మోగులాల్, రడభూషన్, లాల్ సవార్ అని ఇలా ఉంటాయి. రడభూషన్ అయితే మేకని బలిచ్చినంకనే లేపుతరు. పీరీల ముందు గుండాన్ని ఏర్పాటు చేసి దాంట్లో నిప్పలు ఏర్పాటు చేస్తారు. పీరీ లని ఊరేగింపు చేసిన తరువాత రాత్రికి నిప్పల గుండం చుట్టూ , గుండం దగ్గర హాసన్, హుస్సేన్ పేర్లు వీరితో పాటు ప్రాణాలు అర్పించిన వీరుల పేర్లు చదువుతూ హాసన్ హుస్సేన్ హైసాయ్ జూలోయ్ అంటూ అవేశపు కేకలతో పీర్లని చేతపట్టుకుని డప్పు చప్పుళ్లతో నిప్పల గుండం మధ్యలో నడుచుకుంటూ వెళ్తారు. ఈ విధంగా వీరులైన హాసన్ హుస్సేన్ లకి జోహర్లు అర్పిస్తారు. నిప్పల గుండంలో నడిచివెళ్లడం పీర్ల మహత్యంగా భావిస్తారు. ఇలా పీర్ల పండుగ ముగుస్తుంది.**



# జల ద్రిగ్బంధం లో చిక్కుకున్న పలు కాలనీలు

- పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్న పాలకులు..
- ముంపు ప్రాంతాల్లో పర్య టించిన బిఎస్పి నేతలు

**మేడిపల్లి,విశాలభారతి:** గత కొన్ని రోజులుగా ఎడతె రిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ లోని పలు కాల నీ లు పూర్తిగా జల ద్రిగ్బందం లో చిక్కుకున్నాయని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల అంబేద్క ర్ అన్నారు .పీర్జాదిగూడ నుండి పర్వతాపూర్ వెళ్లే ప్రధాన రహదారులు వర్షాల తో గుంతలమయంగ మారి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురు కొంటున్నారని అన్నారు .ప్రధాన రహదారిని తాత్కాలికంగా గుంతలు లేకుండా మరమ్మ తులు చెయాలనీ అన్నారు.ప్రజల నుండి అధిక పన్నులు వసూలు చేస్తూ కాలనీల ను అభివృద్ధి చేయని పాలక మండలి..ప్రజల ఓట్ల ద్వార గెలిచి ప్రజా సమస్యలను పక్క తోవ పట్టించే నాయకు లను అడుగడుగునా ప్రజలు నిలదీయాలనీ బీఎస్పీ నేత ఇటికాల అంబేద్క ర్ .గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తు న్న భారీ వర్షాలకు పీర్జాదిగూ డ కార్పోరేషన్ లో చాలా కాలనీలు జల ద్రిగ్బందంలో చిక్కుకున్నాయని నీట ముని గిన కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే మేయర్ ఏమీ పట్టి పట్టనట్టు గా వ్యవహరించడం సిగ్గు చేటనీ అన్నారు.గత సంవ త్సరం కుడా ఈ విధమైన టువంటి పరిస్థితి వల్ల నీట మునిగిన కాలనీల ప్రజలు కొన్ని రోజులుగా ఇళ్లనుండి బయటకు రాకుండా నిత్యా వసర వస్తువులు కుడా తెచ్చుకునే అవకాశం లేకుం డా చాల ఇబ్బందుల పడుతున్నారని ఐనా పాలకులు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు. నీట మునిగిన పలు కాలనీలలో పాములు తేళ్లు లాంటి విషపూరితమై న కీటకాలు ఇళ్లలోకి వస్తు న్నాయని ప్రజలు ఆందోళన తో భయబ్రాంతులకు గురవు తున్నారని అన్నారు.పన్నుల రూపంలో ప్రజలనుండి వసూలు చేస్తున్న కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ప్రజల అవసరాలకు ఖర్చు చేయ కుండా హంగు ఆర్భాటాలకు ఖర్చు చేసి లక్షల రూపాయా లు వృధాగా పనికిరాని వాటికి ఖర్చు పెడుతున్నార ని అంబేద్కర్ దుయ్యబట్టారు.మేయర్ ప్రచార ఆర్భాటా ల తో తన సొంత ఇమేజ్ కోసం పాపులారిటీ కోసం రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల కు సుమారు 70 లక్షల ప్రజల ధనాన్ని ఖర్చు చేశారని రాష్ట్రం లో ఏ కార్పోరేషన్ కూడా ప్రత్యేక నిధులతో ఈ విదంగా ఆవిర్భావ ఉత్సవాలు చేయలేదని మరి పీర్జాది గూడ లో ఈ హంగు ఆర్భాటాలు ఎందుకు అని ఆయన ప్రశ్నించారు..? అవే నిధుల తో పలు కాలనీలలో పెండిగ్ లో ఉన్న ఎన్నొ పనులను పూర్తి చేయొచ్చని అన్నారు.ఇప్పటికైనా మేయర్ కమిషనర్ కార్పోరేషన్ లొ ముంపుకు గురవుతున్న కాలనీలను గుర్తించి శాశ్వ తమైన పరిష్కారం చూపి ప్రజలకు ఇబ్బందులు లేకుం డా చూడాలని బీ ఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికల అంబేద్కర్ డిమాండ్ చేశా రు .వీటికి శాశ్వత పరిష్కారం చూపకుండా కార్పరేషన్ అధి కారులు పాలకుల వ్యవహరి స్తే రాబోయే కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెపుతారని అన్నారు. ముంపు ప్రాంతా ల్లో పర్యటించిన బీఎస్పీ జిల్లా అధ్యక్షులు రవీందర్ నాయక్ ,జిల్లా కోశాధికారి శ్రీహరీ, బోడుప్పల్ అద్యక్షు లు ఏర్రమైశిగారి ప్రశాంత్, మీడియా ఇంఛార్జి అజ య్,ప్రధాన కార్యదర్శి అఖి ల్, యువ నాయకులు రాజు నాయకులు తడితరులు పాల్గోన్నారు.



# దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

**నిందితుని వద్ద నుండి 14లక్షలు రికవరీ**

**భువనగిరి, విశాలభారతి:** 14 లక్షల రూపాయలను దొంగతనం చేసిన వ్యక్తిని యాదాద్రి భువనగిరి జిల్లా డిసిపి రాజేష్ చంద్ర పర్యవేక్షణలో బొమ్మల రామారం పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. కేసుకు సంబంధించిన వివరాలను డిసిపి ఎం.రాజేష్ చంద్ర ఐపిఎస్ వెల్లడిస్తూ బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన దొంమాట శంకర్ అనే వ్యక్తి బొమ్మలరామారం రెవెన్యూ కార్యాలయంలో ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. శంకర్ దగ్గర తుడుం వెంకటేశం అనే వ్యక్తి కూడా పనిచేస్తున్నాడు. ఇటీవల శంకర్ తన 20 గుంటల భూమిని 14లక్షలకు శ్రీకాంత్ అనే వ్యక్తికి అమ్మగా వచ్చిన డబ్బులని శంకర్ తన కారు డిక్కీలో పెట్టి తాళం వేశాడు. తన దగ్గర పనిచేస్తున్న వెంకటేష్ ఇదంతా గమనించి మధ్యాహ్నం భోజనం తేవడానికి శంకర్ ఇంటికి వెళ్లి డూప్లికేట్ తాళం కూడా తీసుకొని డిక్కీ ఓపెన్ చేసి అందులో ఉన్న డబ్బులను తీసుకొని TS 30 C 8385 నెంబర్ గల స్కూటీ పై వెళ్లిపోవడం జరిగింది. కారులో డబ్బులను ఎవరో దొంగిలించారని బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ లో శంకర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడు వెంకటేష్ ని అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకోవడం జరిగింది. నిందితుని వద్దనుండి 14 లక్షల రూపాయలను రికవరీ చేయడం జరిగింది. కేసును చేదించిన ఎఎస్పి శివం ఉపాధ్యాయ, ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, లని డీసీపీ అబినందించడం జరిగింది.



# 'వర్షాలతో అప్రమత్తత ఉండాలి'


**తుర్కయంజాల్, విశాలభారతి:** వారం రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్లు చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి తెలిపారు. భారీ వర్షాలతో జలమయమైన పలు వార్డులను గురువారం ఆమె పరిశీలించారు. ఇంజాపూర్ ఆపిల్ ఎవెన్యూ కాలనీ, రాగన్నగూడలోని కాలనీలు, కోహెడ వాగును ఆమె సందర్శించారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని అనురాధ రాంరెడ్డి సూచించారు. ఏదైనా సమస్య ఉంటే 99129 66213 9966 99984 నెంబర్లను సంప్రదించాలన్నారు.



## విష జ్వరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలి

**మోతె-విశాలభారతి:** వర్షాలు విపరీతంగా కురుస్తున్న సమయం లో ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి కోటచలం అన్నారు గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి వైద్య సిబ్బంది ని వర్షాల ప్రభావం తీరు అడిగి తెలుసుకున్నారు మండలంలోని ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని నీటిలో మార్పులు చోటు చేసుకోవడంతో పరి శుభ్రమైన నీటిని త్రాగాలని వీధులలో నీటి నిల్వలు లేకుండా చూడాలని చిన్న పిల్లలను బయటకు రాకుండా చూడాలని పాము కాటుకు గురైన వారికి వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని దోమల నివారణకు చర్యలు చేపట్టి పరిసరాల పరిశుభ్రత ను కాపాడాలని కోరారు ఈ కార్యక్రమం లో సి సీ భాస్కర్ రాజు, ప్రాథమిక వైద్యాధికారి నాగరాజు ,సూపర్ వైజర్ కమలమ్మ ,స్టాప్ నర్సు నాగమణి ,శ్రీదేవి లాబ్ టెక్నిషన్ యం వెంకన్న ,హెల్త్ అసిస్టెంట్ సైదులు ,తదితరులు పాల్గొన్నారు.





# వర్షంతో జిల్లాలో అతలాకుతలం

**నిండుకుండల్లా మారిన కుంటలు, చెరువులు**
**శ్రీరామ్ సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు కొనసాగుతున్న ఇన్ఫ్లో**

**నిజామాబాద్ బ్యూరో,- విశాలభారతి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణీ కారణంగా రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అతలాకుతలం మవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని చెరువులు నిండకుండల తలపించి మత్తల్లు దూకుతున్నాయి. అలుగులు పారుతు న్నాయి. ఉపరితల ఆవర్తన ద్రోని కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్త మైంది. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి , తో పాటు సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు స్థానికంగా పరిశీలించి ఎప్పటికప్పుడు చెరువులను డ్యాములోకి చేరుకుంటున్న వరద నీరుపై వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రజలు పని ఉంటే తప్ప బయటకి వెళ్లరాదని, జిల్లాలో రెడ్ అలర్ట్ జారీ చేసినందుకు ప్రజల అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ సైతం ప్రజలకు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలో అన్ని చెరువులు కుంటలు, నిండు కుండలా మారి జలకలను సంతరించు కున్నాయి.

ఇలానే మూడు రోజులు వర్షాలు కురిస్తే చెరువు కట్టలు నిజామాబాద్ జిల్లా వరప్రదాయ నులుగా ఉన్న ఎస్సారెస్పీ నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ప్రస్తుత నీటిమట్టం కంటే ఎక్కువ నీరు చేరుకొని గేట్ల సహాయంతో నీరు కిందికి వదులుతున్నారు. వర్షాలు నేపథ్యంలో లోతట్టు ప్రాంతంలో నివసిస్తు న్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తహసీల్దార్ రుల ఆదేశాల మేరకు రెస్క్యూటివ్ తరలి స్తున్నాయి. వచ్చే రెండు రోజులో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే సంబంధిత తహసిల్దారు లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎవరు పాత ఇండ్లలో నివాసము ఉండ రాదని, లోతట్టు ప్రాంతాల్లో నివసించ కూడదని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు.



# పొంగిపొర్లుతున్న వాగులు,చెరువులు

- **రోడ్ పై నుండి ప్రవహిస్తున్న నీరు రాకపోకలకు అంతరాయం**
- **పట్టణంలో,గ్రామాల్లో లోతట్టు కాలనీలు జలమయం**

**బాల్కొండ,విశాలభారతి:** నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలంలో ఏకధాటిగా భారీ వర్షం కురుస్తోంది.ఈ వర్షాన్నికి మండలంలోని కప్పల వాగు పొంగిపొర్లుతుంది.అన్ని గ్రామాల్లో చెరువులు,కుంటలు నిండిపోయాయి.పంట నష్టం వాటిల్లింది.రోడ్ల పై నుండి ప్రవహిస్తున్న నీరుతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో ఇప్పటి వరకు ముచ్కూర్ గ్రామంలో 3,దేవక్క పేట్ లో 1 ఇండ్లు కూలిపోవడం జరిగిందని తహశీల్దార్ శ్రీధర్ వెల్లడిచారు. పట్టణంలో మొగిలి చెరువు పూర్తిగ నిండడంతో దాని కింద వున్న కాలనీలు నీటితో జలమయం అయిపోయాయి.ఇంట్లో నుండి బయటకు రాని పరిస్థితి కాలనీ వాసులకు నెలుకొంది.వేల్పూర్ వెళ్లే రోడ్డు పూర్తిగా నీటితో నిండి పోయింది. దింతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని ఎస్సీ కాలనీ లో కూలి పోయే పరిస్థితిలో ఉన్న ఇండ్లను సిఐ వేంకటేశ్వర్లు,ఎస్సై హరిబాబు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకోని పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు ఎలాంటి అపాదలో ఉన్న పోలీస్ స్టేషన్ కు లేదా 100 నంబర్ కి కాల్ చెయ్యాలని తెలిపారు.





# జేసిబి ద్వారా గర్భిణీ తరలింపు

**బాల్కొండ, విశాలభారతి:** భీమ్‌గల్ మండలంలోని పిప్రీ గ్రామానికి చెందిన పతాని అజయ్ భార్య అనిల నిండు గర్భిణి, పురటి నొప్పులు రావడంతో ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పిప్రి నుండి పల్లికొండ వచ్చే వరకు పల్లికొండ చెరువు నుండి ప్రవహిస్తున్న అలుగు ఉదృతికి నీరంతా ప్రధాన రహదారి పైకి చేరింది.దాని వల్ల వాహనాల రవాణా నిలిచిపోయింది.దాంతో ఆమెను జేసిబి ద్వారా పల్లి కొండ గ్రామం వరకు తరలించి అక్కడి నుండి ఆర్మూర్ ఆసుపత్రికి తరలించారు. గర్భిణీకి అండగా వచ్చిన ఏఎన్ఎం జమున,అత్త సౌజన్య తో పాటు సహకరించిన అంబులెన్సు సిబ్బంది సుందర్,తిరుపతి లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఊట్కూరు గ్రామంలో ఘనంగా పీర్ల పండుగ వేడుకలు



**శాలిగౌరారం, విశాల భారతి:** శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో గురువారం మొహారం పండుగ వేడుకల్లో భాగంగా ముస్లిం మత పెద్దలు గ్రామస్తులతో కలిసి పీర్లను ఘనంగా ఇంటింటికి ఊరేగించారు. పీర్లకు నీళ్లు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కుల మతాలకతీతంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కులాలకు మతాలకు అతీతంగా ప్రతి ఏటా పీర్ల పండుగను ఊర్లో సంతోషంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు ముస్లిం మత పెద్దలు తెలిపారు.

# పోలవరం పాపం కాంగ్రెస్ బిజెపిలదే



**మచ్చ వెంకటేశ్వర్లు సిపిఐఎం నియోజకవర్గ కన్వీనర్**

**భద్రాచలం,విశాలభారతి:** భద్రాచలం ఏజెన్సీని జల సమాధి చేసేందుకు 2006 లోనే పునాదిరాయి కాంగ్రెస్ పాలకులు వేస్తే 2014లో ప్రత్యేక ఆర్డినెన్స్ తో ఆ కార్యక్రమాన్ని పరిపూర్ణం బిజెపి పార్టీ చేసిందని పోలవరం పాపం కాంగ్రెస్ బిజెపి పార్టీలదేనని సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు. మొదటినుండి పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ఏజెన్సీకి పెను ముప్పు తప్పదని సిపిఎం ఆధ్వర్యంలో అనేక రకాల పోరాటాలు చేసిన విషయం ఇక్కడ ప్రజలకు తెలుసా అని అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు పొద్దున లేస్తే రామ జపం చేసే బిజెపి పాలకులు దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్యను మాత్రం ఎందుకు ముంచాలని చూస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం కరకట్ట ప్రతిష్ట చేసి భద్రాచలం పట్టణాన్ని కొంతమేరకైనా రక్షించాలని సిపిఎం తో పాటు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరద ముంపుని ముందే గుర్తించిన మా పార్టీ పట్ట నాయకత్వం మూడు రోజుల పాటు పాదయాత్ర నిర్వహించి ఆర్డిఓ జిల్లా కలెక్టర్ల దృష్టికి భద్రాచల సమస్యను తీసుకువెళ్లిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. భద్రాచలం ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక శాసనసభ్యులు సైతం ఈ విషయంపై ఎటువంటి పోరాటాలకు నాయకత్వం వహించకపోవడం భద్రాచలం పట్టణం పై జిల్లా మంత్రికి శ్రద్ధ లేకపోవడం వల్ల ఈరోజు భద్రాచలం పట్టణానికి పెను ప్రమాదం వచ్చి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే జిల్లా మంత్రి ఒక తాటిపై వచ్చి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి కరకట్టను ప్రతిష్టపరచాలని ఆయన డిమాండ్ చేశారు భద్రాచలం ప్రజల సంక్షేమం కోసం సిపిఎం పార్టీ ఏ త్యాగానికైనా సిద్ధమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.



## గుండాల ప్రజలను అప్రమత్తం చేసిన స్థానిక ఎంపీటీసీ సర్పంచ్

**గొంగడి రామ్ రెడ్డి, గుండి సీతా లక్ష్మి**

**భద్రాచలం, విశాలభారతి:** ఎటపాక మండలంలో గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది వరద ఉధృతి పెరిగిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి మరియు స్థానిక సర్పంచ్ గుండి సీతాలక్ష్మి తెలిపారు. మండలంలోని గుండాల సచివాలయ పరిధి గుండాల గ్రామంలో స్థానిక ఎంపీటీసీ మరియు స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో, ఉప సర్పంచ్ తోట శశి కుమార్, సచివాలయ కన్వీనర్లు, ఎర్ర గొల్ల నరసింహారావు, కాకాని సురేష్, ముత్తి బోయిన రాము, పంచాయతీ సెక్రటరీలు, వెంకటేశ్వర రావు, నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి స్టాఫ్, వాలంటీర్ వ్యవస్థ, మరియు వార్డు మెంబర్లు, అందరం కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రస్తుతం పెరుగుతున్న గోదావరి వరదల కారణంగా ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించి ముందస్తు జాగ్రత్తగాఇంట్లో ఉన్న అన్ని రకాల పశువులను,, ముందు భద్రపరచుకోవాలని, మరియు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు పడే ప్రమాదం ఉన్నందున, మరియు తెలంగాణలో పైన ఉన్న ప్రాజెక్టుల ద్వారా నీరు రావడం వలన గోదావరి వరద ఉధృతి పెరుగుతుంది. కాబట్టి వరద ముంపుకు గురయ్యే ప్రజలందరూ కూడా, పునరవాస కేంద్రాలలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలోస్థానిక ఎంపీటీసీ మరియుస్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి స్టాఫ్, వాలంటీర్ వ్యవస్థ, అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



## నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి పథకం

**ఎమ్మెల్యే చిరుమర్తి**

**చిట్యాల, విశాలభారతి:** నిరుపేదలకు సీఎం సహాయ నిధి పథకం ఎంతో అండగా ఉంటుందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన రమేష్ కి 2లక్షలు, నార్కట్పల్లి మండలం ఔరవాని గ్రామానికి చెందిన లక్ష్మమ్మకి 1లక్ష రూపాయల విలువగల ఎల్ఓసి చెక్కులను నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్వయంగా హైదరాబాదు లోని నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలు ఆపత్కాలం లో ఉన్నపుడు ఆదుకునే ఆపద్బాంధవుడు సీఎం కెసిఆర్ అని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కొనియాడారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజల ప్రాణాలకు విలువిచ్చి వారి కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రాణపాయ స్థితిలో ఉండి వైద్య ఖర్చులు చెల్లించలేని పరిస్థితుల్లో పేద ప్రజల కోసం అండగా నిలుస్తానని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వెంట నల్లగొండ జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



## హిమాయత్ సాగర్ గేట్ల నుంచి దిగువకు వెళుతున్న వరద నీరు

- **హిమాయత్ సాగర్, గండిపేట్ జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల.**

**విశాలభారతి,గండిపేట్ :** భారీ వర్షాల కారణంగా గత వారం రోజులుగా ఎడతెరపి లేని వర్షాలతో హిమాయత్ సాగర్, గండిపేట్ (ఉస్మాన్ సాగర్ ) చెరువుల్లో కి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో ఈ రెండు చెరువు లు నిండు కుండాలా మారాయి. దీంతో జల మండలి అధికారులు గురువారం హిమాయత్ సాగర్ 4 గేట్లను 2 (ఫిట్ల ) అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేశారు. అదే విధంగా గండిపేట జలాశయం 4గేట్లను 2 అడుగుల మేరా ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదులుతున్నారు. మూసి, ఈ సి నదుల నుంచి వరద నీరు ఉదృతంగా ప్రవహిస్తుంది. ఈ చెరువుల నుంచి విలువడే వరద నీటిని తిలకించేందుకు ఆయా చెరువుల వద్దకు సందర్శకులను ఎవ్వరిని అనుమతించటం లేదు. హిమాయత్ సాగర్ 1763.50 అడుగులు కాగా (2.970 టి ఎం సి ల ) నీటి సామర్థ్యం కాగా ప్రస్తుత నీటి మట్టం 1761.50 అడుగులకు చేరుకొంది. ఇన్ ఫ్లో 2200 క్యూసెక్కు లు ఔట్ ఫ్లో 2750 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గండిపేట్ జలాశయం నీటి సామర్థ్యం 1790 (3.900 టిఎంసీలు) ప్రస్తుతం 1787.50 అడుగుల (3.328టిఎంసీలు)కు చేరుకొంది. ఇన్ ఫ్లో 2000 కాగా ఔట్ ఫ్లో 852 క్యూ సెక్కులు. ప్రస్తుతం 4గేట్లను రెండు అడుగు మేరా ఎత్తి నీటిని విడుదల చేశారు. వర్షం పరిస్థితులు, ఎగువ నుంచి వచ్చే వరద నీటిని బట్టి మరిన్ని గేట్లను ఎత్తే అవకాశం ఉందని జలమండలి అధికారులు చెపుతున్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

## ఇద్దమ్మ మృతి బాధాకరం



**వడ్త్య దేవేందర్ నాయక్**

**దేవరకొండ, విశాలభారతి:** దేవరకొండ పట్టణం పఠాన్ వాడకు చెందిన సంట్రింగ్ మేస్త్రి పులిజాల వెంకటయ్య మాతృమూర్తి ఇద్దమ్మ తెల్లవారుజామున స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహతో కలిసి ఇద్దమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. అదేవిధంగా అంతిమ సంస్కారాల నిమిత్తం తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంలో ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ సుగునయ్య, ప్రస్తుత కౌన్సిలర్ పాలపు అశోక్, పొట్ట బుచ్చయ్య, స్థానికులు ఉన్నారు.



## ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న మూసీ వాగు

**రామన్నపేట, విశాలభారతి:** రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామ పరిధిలోని మూసి వాగు హైదరాబాదులో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నది. లక్ష్మాపురం గ్రామం నుండి వేములకొండ గ్రామానికి వెళ్లే మార్గ మధ్యలో ఉన్న బ్రిడ్జి తాకుతూ మూసి వాగు ప్రవహిస్తుండటంతో గ్రామ సర్పంచ్ ఉప్పు ప్రకాష్ బ్రిడ్జిని పరిశీలించి వాహనదారులకు జాగ్రత్తగా వెళ్లాలని పలు సూచనలు చేయడం జరిగింది.

# భోళా శంకర్ ట్రైలర్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. టీజర్ నుంచి పాటల వరకు సినిమాకు సంబంధించిన ప్రతి ప్రమోషనల్ ఎలిమెంట్ తో ఆకట్టుకున్న మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్ తో ముందుకు వచ్చారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. భోళా శంకర్ ట్రైలర్ కోల్‌కతాలోని అందోళనకర పరిస్థితులలో ఆసక్తికరమైన నోట్ తో ప్రారంభమవుతుంది. చాలా మంది యువతులు కిడ్నాప్ అవుతారు. వారి తల్లిదండ్రులు, పోలీసులు భయాందోళనలో వుంటారు. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, కిడ్నాప్‌ల వెనుక ఉన్న సూత్రధారిని పోలీసులు కనుగొనలేకపోతారు. అప్పుడు భోళా శంకర్.. నేరస్థుడిని పట్టుకోవడానికి, అమ్మాయిలను రక్షించడానికి వస్తాడు. సీరియస్‌గా ప్రారంభమైన కథనం ఒకదాని తర్వాత ఒక ప్రధాన పాత్రల ప్రవేశంతో వినోదాత్మకంగా మారుతుంది. చిరంజీవి వింటేజ్ అవతార్‌లో కనిపించి తన మాస్ పవర్‌ను మరోసారి చూపించారు. యాక్షన్‌తో పాటు వినోదాత్మక సన్నివేశాలలో కూడా ఎక్స్‌ట్రార్డినరిగా వున్నారు. డిఫరెంట్ సీన్స్ లో రాజశేఖర్, పవన్ కళ్యాణ్‌లను మెగాస్టార్ అనుకరిస్తూ కనిపించడం ఆసక్తికరంగా వుంది. తమన్నా భాటియా లాయర్‌గా, కీర్తి సురేష్ చిరంజీవి సిస్టర్ గా, సుశాంత్ ఆమె బాయ్ ఫ్రండ్ గా కనిపించారు. వెన్నెల కిషోర్ భోళా సీనియర్‌గా కనిపించడం నవ్వులు పూయించింది.

# 'మట్కా' గ్రాండ్ గా లాంచ్



వైవిధ్యమైన చిత్రాలతో అలరిస్తున్న మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన 14వ చిత్రాన్ని 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో చేస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మోహన్ చెరుకూరి (CVM), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించనున్నారు. ప్రతిష్టాత్మకంగా రూపొందనున్న #VT14 చిత్రం ఈరోజు హైదరాబాద్‌లో టీమ్, పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. సురేష్ బాబు, చిత్ర నిర్మాతలు ప్రొసీడింగ్స్ ప్రారంభించేందుకు దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ముహూర్తం షాట్‌కు దర్శకుడు మారుతి కెమెరా స్విచాన్ చేయగా, మెగా నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దిల్ రాజు గౌరవ దర్శకత్వం వహించారు. టైటిల్ పోస్టర్‌ను హరీష్ శంకర్ లాంచ్ చేశారు. #VT14కి 'మట్కా'అనే ఆసక్తికరమైన టైటిల్ పెట్టారు. టైటిల్ పోస్టర్ ప్రత్యేకంగా ఆకట్టుకునేలా డిజైన్ చేశారు. 'మట్కా' అనేది ఒకరకమైన జూదం. 19581982 మధ్య జరిగే ఈ కథ యావత్ దేశాన్ని కదిలించిన యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్నారు. కథ వైజాగ్ నేపథ్యంలో జరుగుతుంది. 1958 నుంచి 82 వరకు సాగే కథలో వరుణ్ తేజ్ ని నాలుగు డిఫరెంట్ గెటప్ లలో చూడబోతున్నాం. వరుణ్ తేజ్ కెరీర్ లో హయ్యస్ట్ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా ఉండే ఈ చిత్రం కోసం వరుణ్ తేజ్ కంప్లీట్ గా మేక్‌ఓవర్ అవుతున్నారు.




# కేథరిన్ థెరిసా, సందీప్ మాధవ్ దర్శకుడు అశోక్ తేజ నూతన చిత్రం

ఆహా ఓటీటీలో విడుదలై అందరి ప్రశంసలు అందుకున్న ఓదెల రైల్వే స్టేషన్ చిత్ర దర్శకుడు అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందనున్న నూతన చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పాపులర్ కథానాయిక కేథరిన్ థెరిసా హీరోయిన్‌గా, జార్జిరెడ్డి, వంగవీటి చిత్రాల కథానాయకుడు సందీప్ మాధవ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్‌లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావులు నిర్మిస్తున్నారు. గురువారం జరిగిన ఈ చిత్రం ప్రారంభోత్సవానికి పలువరు సినీ ప్రముఖులు హాజరయ్యారు. హీరో, హీరోయిన్లలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు సంపత్ నంది క్లాప్ నివ్వగా, ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్ స్విచ్చాన్ చేశారు. ప్రసన్నకుమార్, జెమిని కిరణ్‌లు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ ఓదెల రైల్వేస్టేషన్‌ను చూసి నాకు ఈ అవకాశం ఇచ్చారు నిర్మాతలు. కథ వినగానే కేథరిన్, హీరో సందీప్‌లు ఎంతో ఆసక్తి చూపించారు. జార్జిరెడ్డి తరువాత ఎన్నో కథలు విన్న సందీప్ ఈ కథ వినగానే ఓకే చేశాడు. నా ఓదెల రైల్వేస్టేషన్‌కు పదిరెట్లు అద్భుతంగా ఈ సినిమా వుంటుంది అన్నారు. హీరోయిన్ కేథరిన్ మాట్లాడుతూ కథ వినగానే ఎంతో నచ్చింది. స్క్రీన్‌ప్లే బేస్‌డ్ సినిమా ఇది.సరికొత్త యాక్షన్ థ్రిల్లర్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చే చిత్రమిది అన్నారు. కథానాయకుడు సందీప్ మాట్లాడుతూ జార్జిరెడ్డి తరువాత చాలా కథలు విన్నాను. కానీ ఈ కథ వినగానే ఎంతో బాగా నచ్చింది. ప్రతి సన్నివేశం ఎంతో ఆసక్తికరంగా వుంటుంది. సినిమాలో వుండే ట్విస్‌ట్‌లు ఎవరూ ఊహించలేరు. చాలా కాలంగా పోలీస్‌ఆఫీసర్ పాత్రలో నటించాలని మంచి కథ కోసం ఎదురుచూస్తున్నాను. ఈ సినిమాలో అలాంటి పాత్ర దొరికింది.హీరోయిన్ కేథరిన్ పాత్రను కూడా దర్శకుడు ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేయని రీతిలో డిజైన్ చేశాడు. సినిమాకు మంచి టీమ్ కుదరింది అన్నారు. చిత్ర సమర్పకుడు సోమ విజయప్రకాష్ మాట్లాడుతూ ఇంతవరకు నేను వినని సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. చివరి వరకు సినిమాలో వుండే ట్విస్‌ట్‌లు ఎవరూ ఊహించలేరు. అందరి ఊహలకు భిన్నంగా సినిమా వుంటుంది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఖర్చుతో ఈ సినిమాను నిర్మిస్తున్నాం అన్నారు. నిర్మాతల్లో ఒకరైన పల్లి కేశవరావు మాట్లాడుతూ కొంత విరామం తరువాత నిర్మాతగా ఈ సినిమా చేస్తున్నాను. మంచి టీమ్‌తో సినిమా చేస్తున్నాం. చిత్రీకరణ పూర్తయ్యే వరకు కంటిన్యూ షెడ్యూల్ వుంటుంది. అన్నారు.

# కథ వినగానే కొత్త కాన్సెప్ట్ అనిపించింది..

నటుడు బ్రహ్మాజి



సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తోన్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. చిన్న సినిమాగా మొదలైన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ లాంటి పెద్ద సంస్థ రిలీజ్ చేయబోతోంది. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించాడు. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని జూలై 29న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజి మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలివే.. మామూలుగా నేను కొత్తగా చేసే పాత్రలు రావు. ఎందుకంటే రకరకాల పాత్రలు చేసి ఉన్నాను. కానీ ఇందులో మాత్రం నిజంగానే ఓ కొత్త కారెక్టర్ దొరికింది. ఓల్డ్ సిటీలో ఉండే లాయర్. ఉర్దూ, తెలుగు మిక్స్ చేసి మాట్లాడే ఓ కారెక్టర్. విడాకుల స్పెషలిస్ట్ లాయర్‌గా ఇందులో కనిపిస్తాను. మిస్టర్ ప్రెగ్నెంట్ సినిమా షూటింగ్ టైంలోనే నిర్మాత అప్పి రెడ్డి ఈ కథ, కాన్సెప్ట్ గురించి చెప్పారు. ఓ కొత్త దర్శకుడు కథ చెప్పాడు విని, సలహా చెప్పండి అని అన్నారు. కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. బాగుందని చెప్పాను. ఇందులో లాయర్ పాత్రను మీరే అనుకుంటున్నామని అప్పుడు చెప్పారు. మరి హీరో ఎవరు అని అడిగితే.. ఇంకా డిసైడ్ కాలేదని అన్నారు. ఆ తరువాత ఓ నెలకు మా అబ్బాయిని అడగమని అన్నారు. సంజయ్‌కి స్టోరీ చెబితే నచ్చింది. అలా సినిమా స్టార్ట్ చేశాం. సంజయ్ డాగ్ లవర్ అవ్వడంతో కాన్సెప్ట్‌కు ఈజీగా కనెక్ట్ అయ్యాడు. పైగా ఇది చాలా కొత్త కాన్సెప్ట్. మొన్న ఓ సారి పుష్ప పార్ట్ 2 షూటింగ్‌లో ఉన్నాను. రాత్రి పూట షూటింగ్ జరుగుతోంది. బన్నీ ఆ ట్రైలర్‌ను చూసి నా దగ్గరకు వచ్చి ప్రశంసించాడు. ట్రైలర్ నిజంగా బాగుందని అన్నాడు. టీం అందరికీ చెప్పి చూపించాడు. జూలై 21న విడుదల చేయాలని అనుకున్నాం. కానీ ఆ టైంలో సినిమాలు ఎక్కువగా రిలీజ్ అవుతున్నాయని జూలై 29న ఫిక్స్ అయ్యాం. స్లమ్ డాగ్ హజ్బెండ్ స్టోరీని ఆర్జీవీ గారికి వినిపిస్తే.. కుక్క మొగుడు అని టైటిల్ పెట్టమని అన్నారట. కానీ నిర్మాతలు మాత్రం స్లమ్ డాగ్ హజ్బెండ్ అని పెడితేనే బాగుంటుందని అన్నారు.

# పెదకాపు1 పాట విడుదల

దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల తన సినిమాల్లో ప్లజంట్ ట్యూన్‌లు ఉండేలా చూసుకుంటారు. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'పెదకాపు 1'లో కూడా బ్యూటీ ఫుల్ సాంగ్స్ వున్నాయి. సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'అఖండ'ను అందించిన ద్వారకా క్రియేషన్స్ నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. ఫస్ట్ సింగిల్ ప్రోమోకు మంచి స్పందన లభించింది. ఈరోజు పూర్తి పాటను మేకర్స్ విడుదల చేశారు. లీడ్ పెయిర్ ఆకర్షణీయమైన రొమాంటిక్ కెమిస్ట్రీతో ప్రోమో అలరించగా, పూర్తి పాట వారి అందమైన ప్రేమకథను ప్రజంట్ చేసింది. మిక్కీ జె మేయర్ లవ్లీ మెలోడీతో మ్యాజిక్ చేశారు. అనురాగ్ కళ్యాణ కులకర్ణి, చైత్ర అంబడిపూడి వాయిస్ మెస్మరైజ్ చేస్తోంది. కళ్యాణచక్రవర్తి త్రిపురనేని సాహిత్యం ప్రేమలోని లోతుని అద్భుతంగా వర్ణిస్తుంది. కన్నుల విందుగా చిత్రీకరించిన ఈ పాటలోని విజువల్స్ కళ్లకు కట్టినట్లు ఉన్నాయి.



# 'ఖుషి' ఫస్ట్ సింగిల్ 'నా రోజా నువ్వే'



డాషింగ్ హీరో ది విజయ్ దేవరకొండ, సమంత కలిసి నటిస్తున్న పాన్ ఇండియన్ చిత్రం ఖుషి. శివ నిర్వాణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. మైత్రీ మూవీస్ నిర్మిస్తోన్న ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదల కాబోతోంది. ఈ మధ్యే ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను ప్రారంభించింది చిత్రయూనిట్. ఖుషి సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రస్తుతం స్వింగులో ఉన్నాయి. ఈ చిత్రం నుంచి ఇప్పటికే నా రోజా నువ్వే, ఆరాధ్య వంటి పాటలు వచ్చాయి. యూట్యూబ్‌లో ఇప్పటికీ ట్రెండ్ అవుతూ చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. ఇక తాజాగా ఈ చిత్రంలోని మొదటి పాట అయిన నా రోజా నువ్వే వంద మిలియన్ల వ్యూస్‌ను క్రాస్ చేసింది. వంద మిలియన్ల వ్యూస్‌ను కొల్లగొట్టిన నా రోజా నువ్వే పాట ఇప్పుడు మరోసారి నెట్టింట్లో ట్రెండ్ అవుతోంది. గత పదకొండు వారాలుగా ఈ పాట ఎక్కడో చోట ట్రెండ్ అవుతూనే వస్తోంది. ఇక ఈ మూవీ నుంచి జూలై 28న మరో పాట విడుదల కానుంది. ఖుషి టైటిల్ సాంగ్‌ను రేపు విడుదల చేయ బోతోన్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 1న తెలుగుతో పాటు తమిళ్, మళయాల, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయ బోతోన్నారు.

# రష్మిక కూడా అదే తప్పు చేస్తుందా..



కన్నడ భామ రష్మిక మందన్న తెలుగులో అనతికాలంలోనే స్టార్ క్రేజ్ దక్కించుకుంది. నాగ శౌర్య, విజయ్ దేవరకొండ, నాని లాంటి హీరోలతో నటిస్తూ ఆ నెక్స్ట వరుస స్టార్ అవకాశాలను అందుకుంది. తనకు వచ్చిన పాత్రలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ వచ్చిన రష్మిక అలా టాప్ 3 హీరోయిన్స్ లిస్ట్ లో చేరింది. లాస్ట్ ఇయర్ ఆడవాళ్లు మీకు జోహార్లు, సీతారామం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రష్మిక ఆ సినిమాల్లో ఒకటి హిట్ మరోటి ఫెయిల్యూర్ రిజల్ట్ అందుకుంది. సీతారామంలో హీరోయిన్ పాత్ర కాకుండా సపోర్టింగ్ రోల్ చేయడం మంచి విషయం. లుగులో మంచి ఫాం లో ఉన్న టైం లోనే బాలీవుడ్ ఆఫర్లు రావడం వాటికి ఓకే చెప్పడం చేసిన రష్మిక ఏడాదిన్నర అవుతున్నా ఒక్క తెలుగు సినిమా సై చేయలేదు. నితిన్ వెంకీ కుడుముల సినిమా చేస్తుందని అనుకోగా ఆ ప్రాజెక్ట్ నుంచి కూడా ఆమె ఎగ్జిట్ అయినట్టు తెలుస్తుంది. తెలుగులో రష్మిక కొనసాగాలని అనుకోవడం లేదా టాలీవుడ్ పై అప్పడే రష్మిక ప్రేమ తగ్గిపోయిందా అని కామెంట్ చేయడం మొదలు పెట్టారు. కొద్దిగా స్టార్ క్రేజ్ వచ్చిన తర్వాత వచ్చిన ఆఫర్లను చేయకుండా సినిమాలో అది ఉండాలి ఇది ఉండాలి అని హీరోయిన్స్ సినిమాలను రిజెక్ట్ చేయడం తెలిసిందే. స్టార్ హీరోయిన్స్ విషయంలో కూడా అది రిపీట్ అవుతూ వస్తుంది. రష్మిక కూడా ఈమధ్య తన దగ్గరకు వచ్చిన రెండు సినిమాలను కాదనేసిందని టాక్. అయితే ఆ సినిమాల కథ నచ్చలేదో లేదా మరో కారణమో తెలియదు కానీ తెలుగులో అసలు సినిమాలు లేని టైం లో వచ్చిన ఆఫర్ ని కాదనడం రష్మిక గురించి అందరు మాట్లాడుకునేలా చేస్తుంది. రష్మిక కూడా ఇంతకుముందు హీరోయిన్స్ చేసిన పొరపాట్లను చేస్తుందని అంటున్నారు. నేషనల్ క్రష్ రష్మిక నెక్స్ట తెలుగు సినిమా కోసం ఆమె ఫ్యాన్స్ అంతా కూడా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. నితిన్ సినిమా నుంచి దాదాపుగా ఆమె తప్పకున్నట్టే అని తెలుస్తుండగా రష్మిక చేజార్చుకున్న ఈ ఛాన్స్ ని మీనాక్షికి వరించిందని టాక్. ఇలా రష్మిక లైట్ తీసుకుంటే మాత్రం టాలీవుడ్ లో కెరీర్ రిస్క్ లో పడే ఛాన్స్ ఉంది. సో రష్మిక ఇక మీదట జాగ్రత్త పడకపోతే మాత్రం జరగాల్సిన నష్టం జరిగాక ఎంత ప్రయత్నించినా సరే వర్క్ అవుట్ అవ్వదని చెప్పొచ్చు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.